# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 11-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 279 పేజీలు 8 వెల: రూ.1/-


## పాక్ మరో తలతిక్క నిర్ణయం

### 15న జెండా అవనతం చేస్తూ నిరసనలకు పిలుపు

ఇస్లామాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ఇప్పటికే అనేక తిరోగమన చర్యలు తీసుకుంటున్న పాక్ మరో తలతిక్క చర్యకు పూనుకుంది. జమ్మూ కశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు చేస్తూ భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలను నిరసనగా ఆగస్టు 15.. భారతదేశ స్వాతంత్య దినోత్సవం నాడు దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించాలని పాకిస్తాన్ నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, నివాస ప్రాంతాలలో పాకిస్తాన్ జాతీయ పతాకాన్ని అవనతం చేయాలని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 14న కశ్మీరీ ప్రజలు తమ స్వయం నిర్ణయాధికార హక్కు కోసం జరుపుతున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించాలని పాకిస్తాన్ ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీచేసింది.

# శ్రీశైలంకు వరద ఉధృతి

- 10గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న అధికారులు
- పరవళ్లు తొక్కుతూ సాగర్‌లోకి చేరుతున్న కృష్ణమ్మ
- నిండుకుండగా మారిన జూరాల, శ్రీశైలం
- ప్రాజెక్టుల్లోకి నీరురాకతో ఆనందంలో అన్నదాతలు

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆర్ఎన్ఎ) : కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద ప్రవాహం తెలంగాణలోని ప్రాజెక్టుల్లోకి చేరుతుండటంతో



ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. నిన్నమొన్నటి వరకు చుక్కనీరు లేక వెలవెలబోయిన ప్రాజెక్టులు ఇప్పుడు నిండుకుండలను తలపిస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. ఇప్పటికే గత నాలుగు రోజులుగా ఎగువ ప్రాంతమైన కర్ణాటకలోని ఆల్మట్టి నారాయణపూర్ డ్యాం నుండి భారీగా వరదనీరు తెలంగాణ ప్రాంతం గద్వాల జిల్లాలోని జూరాలకు చేరుతుంది. దీనికితోడు నారాయణపేట జిల్లాలోని కృష్ణ మండలం వద్ద భీమా నది ఉధృతంగా ప్రవహిస్తూ కృష్ణానదిలో కలుస్తుండటంతో కృష్ణానదిలో వరద తీవ్రత గంటగంటకు పెరుగుతోంది. ఆల్మట్టి నుంచి, భీమా నది నుండి వచ్చిన కృష్ణమ్మ నీరు జూరాల ప్రాజెక్టులోకి చేరుతుంది. దీంతో జూరాల జలాశయం 40గేట్లను ఎత్తి సుమారు 5.32 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు 5.30లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి నిల్వ 6,142 టీఎంసీలుగా నమోదైంది. జూరాల నుంచి భారీగా వరద ప్రవాహం శ్రీశైలంకు చేరుతుంది. ఇప్పటికే శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. దీంతో శుక్రవారం సాయంత్రం తెలుగు రాష్ట్రాల మంత్రులు నాలుగు గేట్లను ఎత్తి నాగార్జున సాగర్‌కు నీటిని వదులుతున్నారు. ఇదిలా ఉంటే శనివారం ఉదయం నాటికి వరద ఉధృతి మరింత తీవ్రం కావడంతో అధికారులు మొత్తం 12గేట్లకు గాను 10గేట్లను ఎత్తి దాదాపు 2,43,171 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. ఒక్కో గేటును 10 మీటర్ల మేర ఎత్తినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 4.04 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వారు తెలిపారు. శ్రీశైలం జలాశయ పూర్తి స్థాయి నీటిమట్టం885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.70 అడుగులు నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 202.96 టీఎంసీలకు నీటి నిల్వ పైగా ఉంది. ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 42,378 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 31,059 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2,025 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యూలేటరీ ద్వారా 28,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 735 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగార్జున సాగర్ జలాశయానికి కూడా వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 1.02 లక్షల క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 6,051 క్యూసెక్కులు ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గానూ.. ప్రస్తుతం 520.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 150.92 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మరోవైపు భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు వర్షాలు లేక, ప్రాజెక్టుల్లో నీరు లేకపోవటంతో ఈదఫా వరిసాగు కష్టమని భావించారు. కానీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు

తెలంగాణలోని ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. దీంతో రైతులు వరిసాగుకు సమాయత్తంఅవుతున్నారు. ఇదిలా ఉంటే నాగార్జున సాగర్‌కు

భారీగా నీరువచ్చి చేరడంతో రెండుమూడు రోజుల్లో దిగువకు నీటిని వదిలే అవకాశాలు ఉన్నాయి. నాగార్జున సాగర్ పరిధిలో ఖమ్మం, కృష్ణా జిల్లాలోతో పాటు పలు ప్రాంతాల్లో రైతులు పంటల సాగు చేస్తుంటారు. ముఖ్యంగా వరినాట్లు ఎక్కువగా వేస్తుంటారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు భారీగా వరద నీరు చేరుతుండటంతో రైతులు వరినాట్లు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

## తెలుగు చిత్రాలకు పురస్కారాలపై కెటిఆర్ హర్షం

హైదరాబాద్,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): 2018 సంవత్సరానికిగాను 66వ జాతీయ పురస్కారాల్లో తెలుగు చిత్రాలు సత్తాచాటడంపై కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. అలనాటి నటనాభినేత్రి సావిత్రి జీవిత కథతో రూపొందించిన మహానటి మూడు అవార్డులను గెలుచుకొని అగ్రభాగాన నిలిచింది. ఉత్తమ ప్రాంతీయ చిత్రంతో పాటు.. సినిమాలో అద్భుతాభినయాన్ని ప్రదర్శించిన కీర్తి సురేష్ జాతీయ ఉత్తమ నటిగా అవార్డును కైవసం చేసుకుంది. ఉత్తమ కాస్ట్యూమ్స్ విభాగంలో కూడా మహానటి పురస్కారాన్ని సాధించింది. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన రంగస్థలం ఉత్తమ ఆడియోగ్రఫీ, రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చి?ల?సౌ ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగాల్లో అవార్డులను సాధించాయి. అ! చిత్రం మేకప్, వీఎఫ్ఎక్స్ విభాగాల్లో పురస్కారాల్ని సాధించింది. ఈ సందర్భంగా విజేతలని చిరంజీవి, రాజమౌళి, పవన్ కళ్యాణ్‌తో పలువురు సినీ ప్రముఖులు అభినందించారు. తాజాగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ట్విట్టర్ ద్వారా అవార్డు విన్నర్స్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ఇండస్ట్రీకి సంబంధించిన ప్రతిభావంతులని జ్యూరీ గుర్తించింది. జాతీయ అవార్డు అందుకున్న కీర్తి సురేష్‌తో పాటు మహానటి టీంకి అభినందనలు తెలిపారు. అలానే రాహుల్ రవీంద్రన్, రంగస్థలం టీం తో పాటు నానికి కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. శారద(నిమజ్జనం), అర్చన(దాసి), విజయశాంతి(కర్తవ్యం) తర్వాత తెలుగు సినిమా నాయిక సావిత్రి పాత్రధారిణి కీర్తి సురేష్ జాతీయ ఉత్తమ నటిగా పురస్కారాన్ని పొందడం విశేషం.

# హైదరాబాద్‌లో స్వేచ్ఛ ఉంది : కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 10: నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ వికాస సమితి మూడో రాష్ట్ర మహాసభ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ వికాస సమితి భిన్నాభిప్రాయాలను పంచుకునే వేదిక అని తెలిపారు. భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హైదరాబాద్‌లో స్వేచ్ఛ ఉందన్నారు. పాలనలో ఏమైనా తప్పులున్నా ఎత్తి చూపే స్వేచ్ఛ వికాస సమితికి ఉంది. భాషకు మతం ఉండదని ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఎప్పుడూ చెబుతుండేవారు. ముస్లింల కంటే అనర్గళంగా ఉర్దూ మాట్లాడే ఇతరులు చాలా మంది ఉన్నారు. లౌకికవాద దేశమంటే మతాన్ని రద్దు చేయడం కాదు. ఒక మతాన్ని వ్యతిరేకించడం, లేదా అతిగా ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు. సెక్యులరిజం అంటే అన్ని మతాలను పరస్పరం గౌరవించుకోవడం. మతం, రాజకీయం విడదీయలేనంత ప్రమాదకరంగా పెనవేసుకుపోతోంది.

అందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చిన ఘనత తెలంగాణ ఉద్యమానిది. మతోన్మాదం పెచ్చరిల్లితే భవిష్యత్ తరాల పరిస్థితి ఆందోళనకరం. గాడ్సే గొప్ప దేశభక్తుడని సాధ్వీప్రజ్ఞాసింగ్ చేసిన వ్యాఖ్యను తాను ఖండిస్తే సోషల్ మీడియాలో దారుణమైన వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రస్తుతం దేశంలో ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నాయి. తర్కించి, విభేదించే పరిస్థితి లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు. తనతో ఉంటే దేశభక్తుడిని.. లేకపోతే దేశద్రోహిని అనే పరిస్థితులు ఉన్నాయి. ఉదాత్తమైన ఆశయంతో తెలంగాణ వికాస సమితి ఏర్పడింది. తెలంగాణలో మతభేదం లేకుండా జీవనం కొనసాగుతోంది అని కేటీఆర్ పేర్కొన్నారు. 2014, జులై 4వ తేదీన దొడ్డి కొమురయ్య వర్ధంతి రోజున వికాస సమితి ఆవిర్భవించింది.

## మనోహర్‌లాల్ ఖట్టర్ వ్యాఖ్యలపై దీదీ మండిపాటు

### సిఎంగా ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలా అని నిలదీత

కోల్‌కతా,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌పై పశ్చమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి ఈ విధంగా మాట్లాడడం సమంజసమేనా? అని తన ట్విట్టర్ లో మమతా స్పందించారు. సున్నిత అంశాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు నోరు అదుపులోకి ఉంచుకోవాలని మమతా సూచించారు. జమ్ము కశ్మీర్ ప్రజలు ప్రేమించాలని కానీ కించపరిచినట్లుగా మాట్లాడకూడదని చురకలంటించారు. కశ్మీర్ అమ్మాయిలను కించపరిస్తే దేశం మొత్తాన్ని కించపరిచినట్లేనని ఆమె తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో స్వయం ప్రతిపత్తి రద్దు కావడంతో ఆ అమ్మాయిలను పెళ్లి చేసుకోవచ్చని సిఎం మనోహర్ లాల్ ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తన మంత్రి వర్గంలో ఉన్న ఒపి ధంకాడ్ తన కోడలను బీహార్ నుంచి తెచ్చుకున్నారని గుర్తు చేశారు. స్త్రీ, పురుష నిష్పత్తి సమతూల్యం కోసం ఖట్టర్ ఈ విధంగా మాట్లాడరని బిజెపి నాయకులు వత్తాసు పలుకుతున్నారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో పురుషులతో పోలిస్తే స్త్రీల నిష్పతి చాలా తక్కువగా ఉంటుంది.

## రైతుబీమా నమోదులో ఆసక్తి

### ముందుకొస్తున్న రైతులు

హైదరాబాద్,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): రైతుబీమాకు గడవు పెంచడంతో ఇప్పుడుఅనేకులు తమ పేర్లను మరోమారునమోదు చేయించుకుంటున్నారు. జిల్లాల్లో రైతు బీమా ప్రక్రియ వేగంగా సాగుతోంది. బీమా అమలు కానుండడంతో రైతులు కూడా ఆస్తి చూపుతున్నారు. అధికారులకు అడిగిన సమాచారాన్ని ఇస్తున్నారు. రైతుబంధు సాయం అందడంతో ఇప్పుడు వీరిలో భరోసా పెరగింది. ఈ పథకంలో గ్రామాల్లోని


18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న రైతులు అర్హులు కాగా.. బీమాకు అవసరమైన ప్రీమియం రూ.22 72ని ప్రభుత్వం చెల్లిస్తుంది. రైతు ఏ కారణంతో చనిపోయినా ఆ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా బీమా పరిహారంలో రూ.5 లక్షలు అందజేస్తారు. ఇటీవల భూ సమగ్ర సర్వేలో సేకరించిన వివరాల ఆధారంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ వివరాలు ఆధారంగా జిల్లాల్లో బీమా ప్రింటెడ్ పత్రాలను అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి పంపిణీ చేశారు. జిల్లాలో ఇందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లోని రైతు కుటుంబాల్లో నామినీని నిర్ధారణ చేస్తూ నామినేషన్ ఫారంపై పట్టాదారు సంతకం తీసుకుంటున్నారు.

# మయన్మార్‌లో భారీ వర్షాలు

## కొండచరియలు విరిగిపడి 22 మంది మృతి

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): మయన్మార్‌లో కొండచరియలు విరిగిపడడంతో 22 మంది మృతి చెందారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి.

ప్యార్ కోన్ గ్రామంలో కొండచరియలు విరిగిపడడంతో మట్టిలో 16 గృహాలు కూరుకపోయాయి. రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి జెసిబిల సహాయంలో కొండచరియల కింద ఉన్న 22 మృతదేహాలను బయటకు తీశారు. గాయపడిన 47 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కొన్ని కుటుంబాలే గల్లంతయ్యాయని



మయన్మార్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడ్డ దృశ్యం

స్థానిక ప్రజలు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 89000 మంది సహాయక కేంద్రాలలో తలదాచు కున్నారు. మయన్మార్‌లోని మాల్లిమైన్ ప్రాంతంలో జాతీయ రహదారులపై 1.8 మీటర్ల మేర బురద పేరకపోవడంతో సహాయక చర్యలకు ఇబ్బంది ఏర్పడుతోంది. లోతట్టు ప్రాంతాలలో బస్సు, రైల్వే సర్వీసులను రద్దు చేశారు. 100 మంది గల్లంతయ్యారని కొండచరియల కింద ఉండొచ్చని స్థానిక మీడియా పేరొంది. వియత్నాంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరదలు పొటెత్తడంతో ఎనిమిది మంది మృతి చెందగా మరో 20 మంది గల్లంతయినట్టు సమాచారం.

### చరిత్రలో నేటినిజం

కం॥ ప్రకటిత సమ్మోదముగా
నవలంతమ్మైన 'హంపి' సామ్రాజ్యముగా
రకరకములుగా నుడివిన
సుకవిని గొలిచెద "కొడాలి సుబ్బారావు"నే !!

-రాధశ్రీ

( ఆగష్టు 11 కొడాలి సుబ్బారావు జయంతి)

సెల్: 9494481210




# హరితహారం లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం

## నర్సరీల్లో పెరుగుతున్న లక్షల మొక్కలు

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): హరితహారంలో ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిర్చయంతో ముందుకు సాగుతున్నారు. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు. వీటిని జులై మాసంలో గ్రామాల వారీగా పంపిణీ చేసి, అందరిచేత మొక్కలు నాటించేందుకు కృషి చేయనున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయన్న ఆశాభావంతో నాలుగో విడత హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని సన్నాహాలు చేస్తున్నారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపడుతున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలిస్తున్నారు.

# వాగులో చిక్కుకున్న 25మంది రైతులు ఒడ్డుకు

# రెస్క్యూ టీమ్‌తో రక్షించిన అధికారులు

### ఎల్లారెడ్డిలో చెరువులకు జలకళ

కామారెడ్డి,ఆగస్ట్10 (ఆంఎన్ఎ): కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం సంతాయిపేట శివారులోని భీమేశ్వర వాగులో చిక్కుకున్న 25 మంది రైతులను అధికారులు రక్షించారు. వ్యవసాయ పనుల కోసం రైతులు భీమేశ్వర వాగు దాటి వెళ్లారు. తిరిగి ఇళ్లకు చేరుకునే సమయంలో వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో అవతలి వైపు రైతులు చిక్కుకున్నారు. ఐతే సమాచారం అందుకున్న రెవిన్యూ, పోలీసు అధికారులు రెస్క్యూ టీంను రంగంలోకి దించారు. వరద ప్రవహం తగ్గే వరకు అక్కడే ఉన్న అధికారులు శుక్రవారం ఉదయం రైతులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఇదిలావుంటే ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్, నాగిరెడ్డిపేట, తాడ్వాయి, లింగంపేట, రాజంపేట మండలాల్లోని పలు చెరువులు, కుంటలు, డ్యాంలు వరదనీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, డ్యాంలు పూర్తిస్థాయిలో నిండి అలుగులపై నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో జలకళను సంతరించుకున్న చెరువులను, డ్యాంలను చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం 16.5 అడుగులకు చేరింది. ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండటంలో అధికారులు మూడు గేట్లను ఎత్తివేశారు.

# ఆగస్టు 15ను బ్లాక్ డేగా పాటించాలి

## – మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు

హైదరాబాద్, ఆగస్టు10(ఆంఎన్ఎ) : జమ్మూకశ్మీర్‌కు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి అధికరణాలైన ఆర్టికల్ 370, 35 ఏ లను బీజేపీ కేంద్ర ప్రభుత్వం రద్దు చేయటాన్ని, కశ్మీర్ రాష్ట్రాన్ని విభజించడాన్ని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించాలని, ఆగస్టు 15ను 'బ్లాక్ డే'గా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటి పిలుపు నిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. సంఘ్ పరివార్ బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదుల బీజేపీ ప్రభుత్వం తమ పథకంలో భాగంగానే కొద్ది రోజుల ముందు నుండే ఆర్టికల్స్ 370, 35 ఏ లను రద్దు చేయుటానికి ముందు కశ్మీర్ లోయను దిగ్బంధం చేశారని తెలిపింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నాయకత్వాన జాతీయ సలహాదారు అజిత్ ధోవల్, హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా ఇతర ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారని పేర్కొంది. ఉగ్రవాదుల దాడి ముప్పు ఉన్నదనే పేరుతో భారీ స్థాయిలో కశ్మీర్‌లో సైన్యాన్ని మోహరించి 144 సెక్షన్‌లు అమలు చేస్తూ, ఇంటర్నెట్, కమ్యూనికేషన్స్ నిషేధించి ప్రజలను బయట ప్రపంచంతో దూరం చేశారని వెల్లడించింది. అమర్‌నాథ్ యాత్రికులను, విద్యాలయాలను మూసివేసి విద్యార్థులను కశ్మీర్ నుంచి వెనక్కు పంపడం మెదలుపెట్టారని, మాజీ ముఖ్యమంత్రులు మొహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాలను పోలీసులు గృహ నిర్బంధంలోకి తీసుకున్నారని తెలిపింది. ఆ తర్వాతనే రెడ్ అలర్ట్‌ను ప్రకటించారని, భారత్–పాకిస్తాన్ సరిహద్దులో బలగాలను మోహరించారని పేర్కొంది. ఈ అప్రజాస్వామిక చర్యను ప్రజాస్వామిక వాదులు, ప్రజలు, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు, ముస్లిం ప్రజలు వ్యతిరేకిస్తూ నిరసనలు తెలియజేస్తున్నారని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, భద్రతాసమితి తీర్మానాల ప్రకారం కశ్మీర్‌లో చట్టాలను మార్చవచ్చును కాని ఏకపక్షంగా చట్టాల్లో మార్పులు చేసే అధికారం భారత ప్రభుత్వానికి లేదని ఓ ప్రకటనలో పేర్కొన్నట్లు తెలిపింది. జమ్మూకశ్మీర్‌లో 370,35ఏ ఆర్టికల్‌లను రద్దుచేయటాన్ని తెలంగాణలో బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు, వాళ్ల ఎమ్మెల్యేలు, ఎంపీలు సంబరాలు జరుపుకోవటాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చింది. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మైనార్టీలు, దళితులు, ఆదివాసులు, అన్ని సెక్షన్ల ప్రజలు, వామపక్షాలు, బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రతి సంస్థలు, వ్యక్తులు పార్లమెంటులో ఆమోదించి రద్దు చేసిన ఆర్టికల్‌లను పునరుద్ధరించే వరకు పోరాడాలని కోరింది.

# హంతకుడితో కానిస్టేబుల్ ప్రేమాయణం

## పెళ్లితో ఒక్కటైన ఇద్దరు లవర్స్

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): రకరకాలైన ప్రేమకథలు వింటుంటాం.. కానీ ఈ ప్రేమకథ మాత్రం ప్రత్యేకం. ఇలాంటి ప్రేమకథలను మనం చూసి ఉండం. రౌడీకి, మహిళా కానిస్టేబుల్‌కు మధ్య కోర్టులో చిగురించిన ప్రేమ.. పెళ్లి దాకా దారి తీసింది. రౌడీని ప్రేమించి.. పెళ్లి చేసుకున్న ఈ మహిళా కానిస్టేబుల్ గురించే నోయిడాలో అందరూ మాట్లాడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన రాహుల్ థార్సనా(30) 2014లో మన్మోహన్ గోయల్ అనే వ్యాపారిని హత్య చేశాడు. ఈ కేసులో అదే ఏడాది మే 9వ తేదీన అరెస్టు అయ్యాడు. అప్పటికే రాహుల్‌పై డజన్‌కు పైగా హత్య, దోపిడీ కేసులు ఉన్నాయి. అయితే రాహుల్‌ను కోర్టులో హాజరు పరిచేందుకు సూర్జాపూర్ కోర్టుకు తీసుకొచ్చారు. అక్కడ విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ పాయల్.. రాహుల్‌ను చూసి మనసు పారేసుకుంది. రాహుల్ కోర్టుకు వచ్చినప్పుడల్లా అతనితో పాయల్ మాట్లాడేది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. రాహుల్ బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా అతనితో తన ప్రేమయాణాన్ని కొనసాగించింది. ఈ ఐదు సంవత్సరాల ప్రేమ కథకు తెరపడింది. రాహుల్ పాయల్‌ను పెళ్లి చేసుకున్న ఫోటోలను తన సన్నిహితుల వద్ద పంచుకున్నాడు. దీంతో ఆ ఫోటోలు వైరల్ అయ్యాయి. రాహుల్, పాయల్ ఓ మండపంలో సంప్రదాయ దుస్తులు ధరించి పెళ్లి చేసుకున్నారు. అయితే పెళ్లి ఎప్పుడు అయింది.. ఎక్కడ అయింది అనేది మాత్రం తెలియదు. పాయల్ తనకు పెళ్లి అయిన సమయంలో గౌతమ్ బుద్ధనగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంది. పాయల్ గ్యాంగ్‌స్టర్‌ను పెళ్లి చేసుకున్నట్లు రుజువైతే తప్పకుండా ఆమెపై చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. రాహుల్ తనకు ప్రత్యేక గుర్తింపు రావాలన్న ఉద్దేశంతో 2008లో అనిల్ దుజ్జనా గ్యాంగ్‌లో చేరాడు. అప్పట్నుంచి తాను నేరాలు చేయడం మొదలు పెట్టాడు. 2014లో గోయల్ హత్య కేసులో జైలు పాలయ్యాడు. అయితే అతను నేరాలకు పాల్పడడం.. తరుచూ జైలుకు వెళ్లి బెయిల్‌పై రావడం జరుగుతూనే ఉంది.

# కేరళ వరదలపై ప్రధానికి రాహుల్ ఫోన్

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): కేరళలో భీకర వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిస్థితిపై ప్రధాని మోడీతో కాంగ్రెస్ వయనాడ్ ఎంపి రాహుల్ గాంధీ చర్చించారు. ఫోన్‌లో ప్రధానితో మాట్లాడారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాహుల్ గాంధీ వరదల విషయంలో ప్రధాని మోదీ సాయం కోరారు. ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన రాహుల్.. కేరళ పరిస్థితిని వివరించారు. వరద బాధితులకు సాయం చేసేందుకు ప్రధాని అంగీకరించినట్లు రాహుల్ తన ట్విట్టర్‌లో తెలిపారు. కేరళ సీఎంతోనూ రాహుల్ మాట్లాడారు. తనకు వెళ్లాలని ఉన్నా.. రెస్క్యూ ఆపరేషన్ లో ఇబ్బందులు కలగకూడదని వెళ్లడం లేదని చెప్పారు. త్వరలోనే వయనాడ్ సందర్శిస్తానన్నారు. రాహుల్ గాంధీ వయనాడ్ నుంచి ఎంపీగా ప్రతినిథ్యం వహిస్తున్నారు.

# వేలూరు ఉప ఎనికలో డిఎంకె జయకేతనం

### డీఎంకే అభ్యర్థి కథిర్ ఆనంద్ విజయం

### అన్నాడీఎంకే అభ్యర్థి షణ్ముగంపై 8,141 ఓట్ల ఆధిత్యం

చెన్నై,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): తమిళనాడులోని వేలూరు లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో డీఎంకే విజయకేతనం ఎగురవేసింది. అన్నాడీఎంకే అభ్యర్థి షణ్ముగంపై డీఎంకే అభ్యర్థి కతిర్ ఆనంద్ 8వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికలతో పాటే వేలూరు లోక్‌సభకు ఏప్రిల్ 18న ఎన్నిక జరగాల్సి ఉన్నప్పటికీ అక్కడ పెద్ద ఎత్తున డబ్బు బయటపడటంతో కేంద్ర ఎన్నికల సంఘం అక్కడ ఎన్నికను రద్దుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న వేలూరు లోక్‌సభ స్థానానికి పోలింగ్ నిర్వహించగా.. 28 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే, ప్రధాన పోటీ మాత్రం అధికార అన్నా డీఎంకే, డీఎంకే అభ్యర్థుల మధ్యే జరిగింది. పోటాపోటీగా జరిగిన లెక్కింపులో డీఎంకే అభ్యర్థి కథిర్ ఆనంద్ తన సమీప అన్నాడీఎంకే అభ్యర్థి షణ్ముగంపై 8,141 ఓట్ల ఆధిత్యంతో గెలుపొందారు. ఈనెల 5న వెల్లూరు లోక్‌సభ ఉపఎన్నికకు పోలింగ్ జరుగగా, శుక్రవారం ఉదయం 8 గంటలకు స్థానిక ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో భారీ భద్రత మధ్య ఓట్ల లెక్కింపు మొదలైంది. వేలూరు ఉపఎన్నికలో డీఎంకే విజయం సాధించడంతో లోక్‌సభలో డీఎంకే ఎంపీల బలం 24కు చేరింది. వేలూరు లోక్‌సభ ఉపఎన్నికల్లో డీఎంకే విజయం సాధించడంతో ఆ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తల సంబరాలు మొదలయ్యాయి.

నిజానికి ఈ ఉపఎన్నిక గత ఏప్రిల్‌లోనే జరగాల్సి ఉండగా, ఎన్నికల సంఘం సిఫారసు మేరకు ఉపఎన్నికను రాష్ట్రపతి రామ్‌నామ్ కోవింద్ రద్దు చేశారు. ఎన్నికల వేళ డీఎంకే అభ్యర్థికి చెందిన గిడ్డంగిలో భారీగా నగదు పట్టుబడటంతో వెల్లూరులో ఎన్నిక రద్దు చేయాలని ఈసీ ప్రతిపాదించింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

### ఏపీ, తెలంగాణల్లో..

# ఎక్కడినుండైనా రేషన్

### – వన్ నేషన్.. వన్ రేషన్ విధానం అమల్లోకి
### – ఢిల్లీ నుంచి ప్రారంభించిన కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్
### – హైదరాబాద్‌లోని ఏపీవాసులకు ఎక్కువ ఉపయోగం
### – పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్



తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో వన్ నేషన్ వన్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆర్ఎన్ఎ) : తెలంగాణలో 'వన్ నేషన్– వన్ రేషన్ కార్డు' విధానం ప్రయోగాత్మకంగా ప్రారంభమైంది. రాష్ట్రంలో ఈ విధానాన్ని కేంద్ర మంత్రి రాంవిలాస్ పాసవాన్ ఢిల్లీ నుంచి ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకున్ సబర్వాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా 'వన్ నేషన్ – వన్ రేషన్' కార్డు విధానం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నేషనల్ పోర్టబులిటీ తెలంగాణ – ఏపీ క్లస్టర్ ద్వారా సేవలందించనున్నట్టు తెలిపారు. ఇరు రాష్ట్రాల్లో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చన్నారు. దీనివల్ల హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులకు ఎక్కువగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఇదిలాఉంటే వన్ నేషన్... వన్ రేషన్.. అంటే.. రేషన్ కార్డుదారులు దేశంలో ఎక్కడి నుంచైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. సొంతూర్లను వదిలి వలసవెళ్లిన వారు రేషన్‌కు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డ్ పోర్టబిలిటీని ప్రవేశపెట్టింది. వన్ నేషన్.. వన్ రేషన్.. శుక్రవారం నుంచి తెలుగు రాష్ట్రాల్లో అమల్లోకి వచ్చింది. ఏపీలో రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులు తెలంగాణలో, తెలంగాణలో కార్డు ఉన్న వారు ఏపీలో రేషన్ సరుకులు తీసుకోవచ్చు. దేశంలో ప్రజలు ఎక్కడి నుంచైనా సరుకులు తీసుకునేలా 'ఒకే దేశం–ఒకే కార్డు' పేరుతో 2020 జూన్‌లోగా దేశవ్యాప్తంగా అమలుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఈ విధానం అమల్లో ఉంది. దీంతో ముందుగా తెలంగాణలోనే అమలు చేసేందుకు కేంద్రం రెడీ అయింది. రేషన్ పోర్టబిలిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 2.82 కోట్ల మంది రేషన్ కార్డుదారులు లబ్ది పొందుతున్నారు.

రాష్ట్రంలోని ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ విధానాన్ని 2018 ఏప్రిల్‌లో సీఎం కేసీఆర్ అమలు చేశారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో 2.07 కోట్ల మంది వినియోగించుకుంటుండగా? అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 42లక్షలు, మేడ్చల్ జిల్లాలో 29 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 18 లక్షలు, నిజామాబాద్ జిల్లాలో 10 లక్షలు, వరంగల్ జిల్లాలో 9 లక్షల మంది కార్డుదారులు రేషన్ సరుకులను తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోర్టబిలిటీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా అధ్యయనం చేసింది. పోర్టబిలిటీతో మంచి ఫలితాలు రావడంతో దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించింది. ముందుగా ప్రయోగాత్మకంగా ఆగస్టు నుంచి నాలుగు రాష్ట్రాల్లో పోర్టబిలిటీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఏపీ, తెలంగాణ, రాష్ట్రాలను ఒక క్లస్టర్‌గా.. గుజరాత్, మహారాష్ట్రలను రెండో క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. మొదటి క్లస్టర్‌లోని ఏపీ, తెలంగాణలోని లబ్ధిదారులు ఈ రెండు రాష్ట్రాల్లో ఎక్కడి నుంచైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. రెండో క్లస్టర్‌లోని గుజరాత్, మహారాష్ట్రలోని లబ్ధిదారులు ఈ రాష్ట్రాల్లో ఎక్కడి నుంచైనా సరుకులు తీసుకునేలా.. చర్యలు తీసుకున్నారు. అయితే ఆహార భద్రత కార్డుకు ఆధార్ కార్డు లింకై ఉన్న లబ్ధిదారులకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని కేంద్రం ప్రకటించింది. కేంద్ర పౌరసరఫరాల శాఖ నిర్దేశించిన బియ్యం, గోధుమలు, చిరుధాన్యాలను నిర్ణయించిన ధరల ప్రకారం లబ్దిదారులకు సరఫరా చేస్తారు. ప్రతి ఒక్కరికి 3 రూపాయలకు కిలో బియ్యం చొప్పున 5 కిలోల బియ్యం, కిలో 2 రూపాయల చొప్పున గోధుమలు పంపిణీ చేస్తారు. ఇప్పటికే హైదరాబాద్ పంజాగుట్టలోని ఓ రేషన్ షాప్‌లో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెచ్చారు.

# కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముకుల్ వాస్నిక్?

### రాహుల్ సూచనతో తెరపైకి పేరు
### నేటి సిడబ్ల్యూసి సమావేశంలో ఖరారు చేసే ఛాన్స్

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరపరాజయం పాలయ్యాక, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎవరు దీనిని భర్తీ చేస్తారన్న ప్రశ్న నెలకొన్న సమయంలో పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా మాజీకేంద్రమంత్రి, మరాఠా నేత ముకుల్ వాస్నిక్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్ఉల సమాచారం. శనివారం జరిగే సిడబ్ల్యూసి సమావేశంలో అధ్యక్షుడిని ఖరారు చేసే అవకాశం ఉంది. రాహుల్ గాంధీనే కాంగ్రెస్ చీఫ్ గా కొనసాగించాలని పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. అయితే రాహుల్ మాత్రం అధ్యక్షుడిగా ఉండేందుకు విముఖత వ్యక్తం చేశారు. దీంతో సిడబ్ల్యూసి కొత్త అధినేతను నియమించాలని నిర్ణయం తీసుకుంది. ప్రియాంక వైపు పార్టీ నేతలు మొగ్గు చూపడం, ఆమె అందుకు నిరాకరించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. అయితే గాంధీ, నెహ్రూ కుటుంబం నుంచి కాకుండా వేరే నేతను కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించాలని రాహుల్ పార్టీ నేతలకు సూచించారు. దీంతో యుపిఎ చైర్ పర్సన్ సోనియాగాంధీకి అత్యంత విధేయుడైన ముకుల్ వాస్నిక్ ను కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. మరాఠా యోధుడు ముకల్ వాస్నిక్ గతంలో రెండు సార్లు కేంద్ర మంత్రిగా పని చేశారు. పార్టీలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. అంతేకాదు సోనియాకు అత్యంత విశ్వాసపాత్రుడు. దీంతోనే ఆయన్ను జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించాలని సోనియా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీతో శుక్రవారం కాంగ్రెస్ నేతలు భేటీ అయ్యారు. అధ్యక్ష రేసులో ముకుల్ వాస్నిక్ ముందంజలో ఉన్నారని ఈ భేటీ అనంతరం కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ సీనియర్ నేతలు ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, కేసీ వేణుగోపాల్ తదితరులు సోనియాగాంధీతో భేటీ అయిన వారిలో ఉన్నారు. అధ్యక్ష ఎన్నిక ఇప్పటికే ఆలస్యమైందని, నేటి సమావేశంలో కొత్త అధ్యక్షుడిని తప్పనిసరిగా ఎన్నుకోవాలని పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ముకుల్ పేరు తెరపైకి వచ్చింది. అయితే ముకుల్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తారా.. లేదా ఆయనను కొత్త సారథిగా ఎన్నుకుంటారా అన్నది తెలియరాలేదు. 59ఏళ్ల ముకుల్ వాస్నిక్ కాంగ్రెస్ ప్రముఖ నేత బాలకృష్ణ వాస్నిక్ కుమారుడు. యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న ముకుల్.. 25ఏళ్ల వయసులోనే పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా వ్యవహరించారు. పాలనా వ్యవహారాల్లో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలపర్చేందుకు ముకుల్ సరైనవారని పార్టీ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు ముకుల్ వాస్నిక్ సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

# పాక్‌ను హెచ్చరించిన తాలిబన్లు!

## – కశ్మీరు సమస్యకు ఆఫ్ఘనిస్థాన్ పరిస్థితులకు ముడిపెట్టొద్దని హెచ్చరిక

కాబూల్ , ఆగస్టు 10(ఆర్ఎన్ఎ) : జమ్మూ–కశ్మీరుపై భారత దేశం తీసుకున్న నిర్ణయాలపై పాకిస్థాన్ గగ్గోలు పెడుతున్న నేపథ్యంలో తాలిబన్లు పాకిస్థాన్‌ను హెచ్చరించారు. కశ్మీరు సమస్యకు ఆఫ్ఘనిస్థాన్ పరిస్థితులకు ముడిపెట్టవద్దని స్పష్టం చేశారు. పాకిస్థాన్ పార్లమెంటులో పీఎంఎల్–ఎన్ పార్టీ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలపై తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహెద్ ఘాటుగా స్పందించారు. ముజాహెద్‌ను ఉటంకిస్తూ ఓ వార్తా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం కొన్ని పార్టీలు కశ్మీరు సమస్యను, ఆఫ్ఘనిస్థాన్ సమస్యతో ముడిపెట్టడం ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించడానికి దోహదపడదని ముజాహెద్ చెప్పారు. దానికి కారణాన్ని వివరిస్తూ ఆఫ్ఘనిస్థాన్ సమస్య ఇతర దేశాలతో సంబంధం లేనిదని, ఇతర దేశాల మధ్య పోటీకి వేదికగా ఆఫ్ఘనిస్థాన్ మారవలసిన అవసరం లేదని చెప్పారు. పాకిస్థాన్ పార్లమెంటులో పాకిస్థాన్ ముస్లిం లీగ్–నవాజ్ పార్టీ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ ఇటీవల మాట్లాడుతూ కాబూల్‌లో ఆఫ్ఘన్లు ప్రశాంతంగా ఉన్నారని, కశ్మీరులో రక్తం చిందుతోందని అన్నారు. ఇది తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ వ్యాఖ్యలను ఆఫ్ఘన్లు కూడా ఇష్టపడలేదు. సామాజిక మాధ్యమాల ద్వారా తమ అసంతృప్తిని తెలిపారు.

# భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం సహించం

## ప్రపంచాన్ని తపపుదోవ పట్టించే చర్యలు మానాలి

## పాక్‌కు గట్టిగా హెచ్చరించిన భారత్

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): భారత దేశ అంతర్గత వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవద్దని పాకిస్థాన్‌ను భారత ప్రభుత్వం మరోమారు ఘాటుగా హెచ్చరించింది. అదే సమయంలో వాస్తవాలను అంగీకరించాలని హితవు పలికింది. ఇతర దేశాలకు కశ్మీరు సమస్యను వివరిస్తోంది. భారత దేశ విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కశ్మీరుపై వాస్తవాన్ని పాకిస్థాన్ అంగీకరించాలని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించడం మానుకోవాలని చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలపై అత్యంత భయానక దృశ్యాన్ని చూపించేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జమ్మూ-కశ్మీరులో అభివృద్ధి జరిగితే, ప్రజలను తప్పుదోవపట్టించడం సాధ్యం కాదని పాకిస్థాన్ భావిస్తోందని, అందుకే ఆ రాష్ట్రం విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల పట్ల పాకిస్థాన్ నైరాశ్యంతో ఉందనే భావన ఉందని అన్నారు. జమ్మూ-కశ్మీరుపై భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల తర్వాత పాకిస్థాన్ ప్రకటించిన చర్యలన్నీ ఏకపక్షమేనని తెలిపారు. భారత్ చేపట్టిన చర్యలన్నీ ఆ రాష్ట్ర అత్యుత్తమ ప్రయోజనాల కోసమేనన్నారు. సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును పాకిస్థాన్ నిలిపేయడం దురదృష్టకరమని, దీనిపై భారత్ విచారం వ్యక్తం చేస్తోందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని పాకిస్థాన్‌ను కోరినట్లు తెలిపారు. పాకిస్థాన్ జైలులో ఉన్న భారత నావికాదళం మాజీ కమాండర్ కుల్‌భూషణ్ జాదవ్ కన్సులర్ యాక్సెస్ విషయంలో పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.

జమ్మూ-కశ్మీరు విభజన, అధికరణ 370 రద్దు వంటి చర్యలు భారత దేశ అంతర్గత వ్యవహారాలని అనేక విదేశీ ప్రభుత్వాలకు, అంతర్జాతీయ సంస్థలకు భారత దేశం తెలిపినట్లు వివరించారు.

# యోగా పాలనపై ఎస్పీ యుద్ధం

## రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు

లక్నో,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): యూపి సిఎం యోగి పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసన ర్యాలీలు చేపట్టింది. ఉన్నావ్ సంఘటన, పెట్రోధరల పెంపు, రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణత, ఎస్పీ నాయకులపై దాడులు, రైతుల సమస్యలతో సహా మొత్తం 25 అంశాలపై ఎస్పీ నిరసన ర్యాలీలు చేపట్టింది. అయితే కొన్ని జిల్లాల్లో ఈ ప్రదర్శనలు హింసాయుతంగా మారాయి. పోలీసులు లాఠీ చార్జీలు చేయడంతో మరింత రెచ్చిపోయిన కార్యకర్తలు, రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో నేరాల తీవ్రత విపరీతంగా పెరిగిపోయాయని, అయినా సరే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని ఎస్పీ ధ్వజమెత్తుతోంది. అయితే ఇంతటి ప్రాధన్యమైన కార్యక్ర నికి ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ హాజరు కాలేదు. తమ పార్టీ ఒకప్పుడు నిరసనలకు ప్రసిద్ధి చెందిందని, కానీ సమయం, పరిస్థితులలో ఇప్పుడు చాలా అరుదుగా మారాయని అన్నారు. దీంతో పార్టీని, దాని అనుబంధ సంఘాల్లో మరింత ఉత్సాహం నింపడానికి ఈ ర్యాలీలు ఉపయోగపడతాయని ఆ పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు తెలిపారు. కేవలం ఇదే కాకుండా అధికార పార్టీ శ్రేణులపై దాడులకు పాల్పడుతోందని, తమ పార్టీ అండగా ఉంటుందన్న నమ్మకాన్ని శ్రేణులకు పంపడానికి కూడా ఇది ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

# హరితహారం పౌరుల బాధ్యత

## అందరూ కలస్తేనే మంచి ఫలితాలు: వర్గీస్

హైదరాబాద్,ఆగస్ట్10 (ఆర్ఎన్ ఎ):హరిత హారం ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ, హరితహారం ప్రత్యేకాధికారి ప్రియాంక వర్గీస్ అభిప్రాయపడ్డారు. నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలన్నారు. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టామని తెలిపారు. వీటిని ప్రజలు కూడా ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వంతో కలసి రావాలని అన్నారు. ప్రతి జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. మూడు ఫీట్లకు పైగా ఉన్న మొక్కలను మాత్రమే నాటాలన్నారు. హరితహారం నిరంతర పక్రియ అని చెప్పారు. ప్రతి ప్రభుత్వ సంస్థల్లో వంద శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యాచరణ రూపొందించాలనీ, హరితవనాల కోసం స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలని, సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటాలన్నారు. ఈ ఏడాది ఎక్కువ హరిత వనాల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు, వీలైనన్ని చోట్ల అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పండ్ల మొక్కల్లో అడవి మామిడి పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, కూలీలను హరితమిత్ర అవార్డుకు నామినేట్ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు

# అక్రమ సంబంధానికి వ్యక్తి బలి

గుంటూరు,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): వివేహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడనే కోపంతో ఏడుకొండలు (35) అనే వ్యక్తిని నాగయ్య అనే మరోవ్యక్తి దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. గుంటూరు జిల్లా బొల్లాపల్లి మండలంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్లటూరుకు చెందిన అంకె ఏడుకొండలు పశువుల కాపరి. శుక్రవారం ఉదయం గేదెలను తోలుకొని సమీపంలో అడవికి వెళ్లాడు. శనివారం వరకు ఇంటికి చేరకపోయేసరికి బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానికుల సహాయంతో పోలీసులు అడవిలో గాలించగా ఓ ప్రదేశంలో గోనె సంచిలో ఓ మృతదేహం కనిపించింది. తల నరికి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టగా ఏడుకొండలు భార్యతో నాగయ్య అనే వ్యక్తికి గత కొంతకాలంగా వివేహేతర సంబంధం ఉందని, ఈ విషయమై వీరివురి మధ్య గొడవలు ఉన్నట్లు గుర్తించారు. నాగయ్య శుక్రవారం సాయంత్రం అడవికి వెళ్లి అతనితో ఘర్షణ పడి ఏడుకొండలను గొడ్డలితో నరికి చంపి సంచిలో మూటకట్టి అక్కడే పడేసి పరారైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ మేరకు సీఐ సుబ్బారావు, ఎస్సై వెంకటరావు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కొనసాగుతున్న మనగుడి

తిరుపతి,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): సమాజంలో సనాతన భారతీయ హైందవ ధర్మ విలువలు నింపి, భావితరాలకు ఆలయ ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకు టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టని మనగుడి తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. 19వ విడత మనగుడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిటిడి తిరుపతి జెఈవో శ్రీ పి.బసంత్‌కుమార్ తెలిపారు. ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 11,500 ఆలయాలలో మనగుడి కార్యక్రమం కొనసాగుతోంది. ఇందుకోసం అక్షింతలు, కంకణాలు, పసుపు, కుంకుమ, కలకండ తదితర పూజాసామగ్రిని టిటిడి పంపిణీ చేసింది. ఇందులో భాగంగా ఆయా ఆలయాల్లో భజనలు, సంగీతం, కుంకుమార్చన, దీపారాధన తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే అక్కడక్కడా ధార్మికోపన్యాసాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో మనగుడి కార్యక్రమంలో పాల్గొని స్వామి, అమ్మవార్ల పూజల్లో పాల్గొంటున్నారు.

## ప్రజలకు మరింత చేరువయ్యేలా..

# ఫ్రెండ్లీ పోలీసింగ్

### - మోడల్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించిన హోంమంత్రి

విజయవాడ, ఆగస్టు10 (ఆర్ఎన్ఎ) : ఏపీలో పోలీసులు ప్రజలకు మరింత చేరువయ్యేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. శుక్రవారం అవనిగడ్డలో మోడల్ పోలీస్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు పేర్ని నాని, మోపిదేవి వెంకటరమణ, అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్, డిఐజి ఏఎస్ ఖాన్‌లు అతిథులుగా హాజరయ్యారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన హోం మంత్రి మేకతోటి సుచరితకు అధికారుల సమక్షంలో ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి మౌలిక సదుపాయల కల్పన కోసమే మోడల్ పోలీస్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు సుచరిత పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మహిళల సమస్యలను పరిష్కరించడానికి 'మహిళా క్రాంతి' కార్యక్రమాన్ని ప్రారంబించినట్లు ఆమె స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో 'మహిళా మిత్ర' పేరిట ఒక మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే మహిళలు తమ సమస్యలను మరింత స్వేచ్ఛగా తెలపడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. మహిళా పోలీసులు బందోబస్తుకు వెళ్లినపుడు వారికి కనీస అవసరాలు తీర్చేందుకు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అవినీతి రహితంగా ఉంటూ, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా లక్ష్యం పెట్టుకోవాలని సుచరిత పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధం

### హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

హైదరాబాద్,ఆగస్10 (ఆర్ఎన్ఎ): మునిసిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.

శుక్రవారం ఈ మేరకు హైకోర్టులో కౌంటరు దాఖలు చేసింది.

ఎన్నికలపై స్టే ఉన్న మునిసిపాలిటీల్లో అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించామని ప్రభుత్వం కౌంటర్‌లో పేర్కొంది. వివిధ మున్సిపాలిటీల్లో వార్డుల విభజన,రిజర్వేషన్లపై కేసులు దాఖలు కాగా పలు మున్సిపాలిటీలపై మైకోర్టు స్టే విధించింది. దీంతో వీటి ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న సంశయం ఏర్పడింది. ఈదశలో వీటిపై ప్రభుత్వం వివరణ కూడా ఇచ్చింది. కాగా ఈ అంశంపై ఈ నెల 13న హైకోర్టు విచారించనుంది.

# నకిలీ షేర్ కంపెనీతో మోసం

### ఇద్దరిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): అధిక లాభాలు అందిస్తామని చెబుతూ నకిలీ షేర్ మార్కెట్ కంపెనీని ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను రాచకొండ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు.

మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి కంప్యూటర్, సెల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రావణ్ చిట్టి రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేసి పట్టుకున్నారు.

బెంగళూరు కేంద్రంగా డీ.మాట్ అకౌంట్ దారులే లక్ష్యంగా నేషనల్ స్టాక్ రీసెర్చ్ కంపెనీ పేరుతో నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు.

## ఏపీ వార్తలు

# సామాజిక సమతుల్యం పాటించడంలో విఫలమయ్యాం

- పార్టీకి అండగాఉండే బీసీ, మాదిగ సామాజికవర్గాల ఓట్లు చీలాయి
- అందుకే ఘోర ఓటమిపాలయ్యాం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో అభిప్రాయపడ్డ నేతలు
- ఆ సామాజికవర్గాలకు దగ్గరయ్యేలా చర్యలు చేపట్టాలి
- ఆమేరకు ముందుకెళ్దామని నేతలకు సూచించిన చంద్రబాబు
- తెదేపా నేతలకు భద్రత తొలగింపు
- రైతు ఆత్మహత్యలు వంటి పలు అంశాలపై భేటీలో సుధీర్ఘ చర్చ
- సమావేశంలో అయ్యన్నపాత్రుడు కంటతడి
- పొలిట్‌బ్యూరో ప్రక్షాళన జరగాలన్న సోమిరెడ్డి

అమరావతి, ఆగస్టు10(ఆర్ఎన్ఎ) : సామాజిక సమతుల్యం పాటించకపోవడం వల్లే గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి ప్రధాన కారణమని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు అధ్యక్షతన పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ ఘోర ఓటమికి గల కారణాలపై విశ్లేషించారు. పార్టీ ఇంతగా దెబ్బతినడానికి కారణాలు, అసలు ఎందుకు ఎక్కువ స్థానాల్లో ఓడిపోయాం, ప్రజాదరణ కలిగిన నేతలూ ఎందుకు ఓడిపోవాల్సి వచ్చింది అనే విషయాలపై సుధీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నుదన్నుగా ఉన్న బీసీలు, మాదిగ సామాజిక వర్గ ఓట్లు చెదిరిపోవడం వల్లే ఘోరంగా దెబ్బతిన్నామని నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడినా ఫలితం లేకుండా పోయిందని సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇతర సామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్లే బీసీ, మాదిగ సామాజిక వర్గాల ఓట్లలో చీలిక వచ్చిందనే అభిప్రాయానికి నేతలు వచ్చారు. మొత్తం 12అంశాలపై ప్రధానంగా చర్చించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై విశ్లేషణలో బీసీ, మాదిగ సామాజిక వర్గాలను తిరిగి పార్టీ దగ్గరయ్యేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చించినట్టు తెలిసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడం, తెలుగుదేశం నేతలపై దాడులు, తెదేపా నేతలకు భద్రత తొలగింపు, రైతు ఆత్మహత్యలు వంటి పలు అంశాలు ఈ భేటీలో చర్చకు వచ్చాయి. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.5వేలు ఏమాత్రం సరిపోవని.. రూ.10వేల పరిహారంగా చెల్లించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. గోదావరి నదీ జలాల వినియోగం.. తెలుగు ముఖ్యమంత్రుల మధ్య అంతర్గతంగా జరిగే అవగాహన ఒప్పందం కారాదని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370, 35ఏ రద్దును తెదేపా పొలిట్ బ్యూరో స్వాగతించింది. భవిష్యత్తులో దేశ ప్రయోజనాల కోసం కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెదేపా మద్దతిస్తుందని స్పష్టం చేసింది. సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది. ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలపై జరిగిన విశ్లేషణలో తెలుగుదేశం హయాంలో చేపట్టిన పనులు, కష్టపడిన తీరును అయ్యన్నపాత్రుడు గుర్తుచేశారు. ఇంత చేసినా ప్రజలు వైకాపా వైపు మొగ్గడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అన్న క్యాంటీన్‌ల మూసివేత కారణంగా అందరూ బాధపడుతున్నారంటూ అయ్యన్న పాత్రుడు కంటతడి పెట్టుకున్నట్టు సమాచారం. మరోవైపు పొలిట్ బ్యూరోని ప్రక్షాళన చేస్తే బాగుంటుందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

తెలంగాణ, ఆంధ్రాలో కొందరు పొలిట్ బ్యూరో సభ్యులు పార్టీ వీడినందున ప్రక్షాళన చేయడం మంచిదని ఆయన సూచించారు. గత ఐదేళ్లలో చంద్రబాబు పడిన కష్టాన్ని ఇప్పుడు ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని సోమిరెడ్డి అన్నట్లు తెలిసింది. అలాగే పార్టీ ప్రక్షాళన చేసే దిశగా కీలక చర్చ జరిగినట్టు సమాచారం. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కొత్త కమిటీల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం చంద్రబాబు స్పందిస్తూ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. సంస్థాగతంగా బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపైనా ఈ భేటీలో చర్చించారు.

# విజయవాడలో విషాదం

- తాడేపల్లి గోశాలలో 110 ఆవులు మృతి
- విచారణ చేపట్టిన పోలీసులు
- దాణాలో పాయిజనింగ్‌పై అనుమానం

విజయవాడ, ఆగస్టు10(ఆర్ఎన్ఎ) : విజయవాడలో విషాదం చోటు చేసుకుంది. 110 ఆవులు మృతిచెందటంతో స్థానికంగా కలకలం రేపింది. విజయవాడ శివారులోని కొత్తూరు తాడేపల్లి గోశాలలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. మరికొన్ని ఆవులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. కాగా వైద్యులు వాటికి చికిత్స అందిస్తున్నారు. కాగా స్థానికుల సమాచారం మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడేపల్లిలోని గోశాలలో ఆవులను సాకుతున్నారు. కాగా ప్రతీ రోజూలాగానే గోశాల సిబ్బంది ఆవులకు దాణాను అందించారు. కాగా శనివారం లేచి చూసేసరి 100ఆవులు చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. కాగా మరికొన్ని ఆవుల తీవ్ర అస్వస్థతకు గురికావటంతో వాటికి పశువైద్యులు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే 100ఆవులు మృతిచెందడంతో స్థానికంగా కలకలం రేపింది. కాగా మరో పది ఆవులు కొద్దిసేపటికి మృతి చెందాయి. దీంతో మృతుల సంఖ్య 110కి చేరింది. పోలీసులకు అందిన సమాచారం మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే శ్రావణ శుక్రవారం అర్థరాత్రి సమయంలో పశువులకు పెట్టిన దాణాలో ఏమైనా విషం కలిసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే మృతిచెందిన ఆవులకు పోస్టుమార్టం చేసిన తరువాత ఫుడ్ పాయిజన్ జరిగిందా.. ఇంకాఏకారణంగానైనా మృతిచెందాయా అని తెలుతుందని పోలీసులు తెలిపారు. వెంటనే 110 ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. మరోవైపు గోశాల నిర్వాహకులకు ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా? ఆ కక్షతోనే విరోధులు ఇలాంటి చర్యలకు పనుకొన్నారా ? అనే దిశలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గోవుల మృతిపై బీజేపీ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కుట్రపూరితంగానే జరిగి ఉంటుందని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించి గోవుల మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్, జేసీలు ఘటన స్థలికి చేరుకున్నా. అక్కడే పశువైద్యులచే గోవులకు పోస్టుమార్టం నిర్వహించారు. పశువులను ప్రొక్లెయిన్‌ల ద్వారా తీసుకొచ్చి అన్నింటిని ఒకేదగ్గర ఉంచి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతరం అక్కడే గోవులను ఖననం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో అధికారుల నిర్ణయాన్ని స్థానిక గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక్కడ గోవులను పూడ్చడం ద్వారా తమకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, తద్వారా తాము వ్యాధుల భారిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు చనిపోయిన గోవులను ఎక్కడ పూడ్చాలనేదానిపై సమాలోచన చేస్తున్నారు.

నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం - మంత్రి వెల్లంపల్లి

తాడేపల్లి గోశాలలో మృతి చెందిన గోవుల ప్రదేశాన్ని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌లు పరిశీలించారు. గోశాలలో ఆవులు మృతి చెందడంపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. పోసుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోవుల పైన విషయప్రయోగం జరిగిందా..? లేదా? అనేది పోస్టుమార్టం తర్వాత తెలుతుందని అన్నారు. మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

## తాడేపల్లి సమీపంలో..

# వైసీపీ కేంద్ర కార్యాలయం ఏర్పాటు


- ప్రారంభించిన అధినేత, సీఎం జగన్మోహన్‌రెడ్డి
- హాజరైన పార్టీ ప్రముఖులు

అమరావతి, ఆగస్టు 10(ఆర్ఎన్ఎ) : అమరావతి కేంద్రంగా వైసీపీ కార్యకలాపాలు మొదలయ్యాయి. తాడేపల్లిలో వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రారంభమైంది. వైసీపీ అధినేత, సీఎం జగన్మోహన్‌రెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆశీనులయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు. అంతకు ముందు జగన్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతంలో హైదరాబాద్ కేంద్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఉండేది. కానీ ఎన్నికల సమయంలో పార్టీ కార్యాలయాన్ని అమరావతికి షిఫ్ట్ చేశారు. ముందు తాడేపల్లిలోని జగన్ నివాసంలోనే పార్టీ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించాలని భావించారు. అయితే దాన్ని క్యాంపు కార్యాలయంగా ఉపయోగిస్తుండటంతో.. ప్రత్యేకంగా పార్టీ కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేయాలని జగన్ పార్టీ నేతలను ఆదేశించారు. జగన్ ఆదేశాతో పార్టీ నేతలు కొత్త భవనం కోసం వెతికారు. ఈ లోపు వైసీపీకి చెందిన నేతకు సంబంధించిన భవనం నిర్మాణంలో ఉంది. దీంతో ఆయన్ను ఒప్పించి ఆ భవనాన్ని పార్టీ కేంద్ర కార్యాలయంగా మార్చేశారు. చుట్టూ అద్దాలతో, పచ్చదనంతో.. ఆధునిక హంగులతో భవనాన్ని తీర్చిదిద్దారు. కాగా శనివారం జగన్ చేతులమీదుగా కార్యాలయంను ప్రారంభించారు.

# నిత్యాన్నదాన సత్రంలోకి వరదనీరు

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్ 10(ఆర్ఎన్ఎ): గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదస్థాయికి చేరుకుంది. ఎగవనుంచి వరద పోటెత్తడంతో గోదావరి ఉరకలేస్తోంది. దీంతో పట్టణంలోకి కూడా నీరు వచ్చిచేరుతోంది. భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం, ఉచిత నిత్యాన్నదాన సత్రం నీట మునిగాయి. అలాగే విస్తా కాంప్లెక్స్, చప్టా దిగువ పరిసరాల్లోకి బ్యాక్ వాటర్, డ్రైన్ వాటర్ చేరుకున్నాయి. విస్తా కాంప్లెక్స్ వద్ద నీటిని మోటర్ల ద్వారా లిప్ట్ చేస్తున్న సమయంలో మోటార్ల ఫుట్‌బాల్‌లోకి ఎ÷-లాస్టిక్ కవర్లు చేరడంతో సమస్యలు వస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు

# శ్రీవారికి రూ. 14 కోట్ల విరాళం..



తిరుపతి, ఆగష్టు 10:అమెరికాకు చెందిన ఇద్దరు ప్రవాస భారతీయ వ్యాపారులు తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి శుక్రవారం రూ.14 కోట్ల భారీ విరాళం అందజేశారు. ఆలయ అధికారుల సమాచారం మేరకు.. స్నేహితులైన ఎన్నారై వ్యాపారులు వరలక్ష్మి అమ్మవారి వ్రతం రోజు శ్రీవారిని కుటుంబ సభ్యులతోపాటు దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ ప్రత్యేకాధికారి ఏవీ ధర్మారెడ్డికి రూ.14 కోట్ల డిమాండ్ డ్రాఫ్టును అందజేస్తూ, తమ పేర్లను గుప్తంగా ఉంచాలని కోరారు. తాము ఇచ్చిన విరాళాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సంక్షేమ ట్రస్టులకు వినియోగించాలని ఆలయ అధికారులను కోరారు. ఈ ఇద్దరు గత సంవత్సరం జూలైలోనూ రూ.13.5 కోట్లను టీటీడీ ట్రస్టులకు విరాళంగా ఇవ్వడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు గురువారం రూ.1.11 కోట్లను టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళంగా అందజేశారు. యుగమేటి రామిరెడ్డి కుటుంబసభ్యులతో శ్రీవారిని దర్శించుకుని విరాళం డిమాండ్ డ్రాఫ్ట్‌ను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అందజేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

# అందమైన కశ్మీరీ అమ్మాయిలే మా కోడళ్లు



హైదరాబాద్, ఆగస్ట్10: హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఎవరు శాశ్వత నివాసితులో తేల్చేందుకు తీసుకొచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆర్టికల్ రద్దుతో కశ్మీరీ అమ్మాయిలను పెళ్లి చేసుకునేందుకు మార్గం సుగమమైందని ఖట్టర్ అన్నారు. బీహార్ నుంచి కోడళ్లను తెచ్చుకుంటామని మా కేబినెట్ మంత్రులు అంటుండేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఇకపై కశ్మీర్ నుంచి కోడళ్లను తెచ్చుకోవచ్చు. ఆర్టికల్ 35ఏ రద్దుతో ఇది సాధ్యమైందన్నారు హర్యానా సీఎం తెలిపారు. కశ్మీర్ అమ్మాయిలను కోడళ్లు, భార్యగా చేసుకునేందుకు అందరూ మొగ్గుచూపుతారని మనోహర్‌లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమం తర్వాత హర్యానాలో లింగ నిష్పత్తిలో వ్యత్యాసం తగ్గిందన్నారు. ఒకప్పుడు 1000 మంది బాలురకు 850 మంది అమ్మాయిలు ఉండేవారు. భేటీ బచావో భేటీ పఢావో కార్యక్రమం విజయవంతమైన తర్వాత అమ్మాయిల సంఖ్య 933కు చేరిందని తెలిపారు. ఒక కశ్మీరీ మహిళ భారతదేశంలోని ఇతర రాష్ట్రంలోని ఒక వ్యక్తిని పెళ్లి చేసుకుంటే ఆ మహిళక కశ్మీరీ పౌరసత్వం కోల్పోయేది. కానీ ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీరి మహిళ ఆ పౌరసత్వాన్ని కోల్పోదు.

# కర్నాటకలో ఎడతెరిపిలేని వర్షాలు

## ఇల్లు కూలిన ఘటనలో ఐదురుగు సజీవ సమాధి

బెంగళూరు,ఆగస్ట్10 (ఆర్ ఎన్ఎ): కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఐదుగురు మృత్యువాత పడ్డారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పలు గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. కొడ్గవ్ జిల్లాలోని బాగమండల సమీపంలో ఓ ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సజీవ సమాధి అయ్యారు. మృతులను యశ్వంత్, బాలకృష్ణ, ఉదయ, యమునగా గుర్తించారు. మరొకరి పేరు తెలియాల్సి ఉంది. ఇల్లు కూలిన ప్రాంతానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని శిధిలాలను తొలగిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో బాగమండలలో 400 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తంగా కేరళలో కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళు న్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న 44 వేల మంది ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

# తలసేమియా గ్రస్తులకు అండగా ఉంటాం: ఈటెల

రంగారెడ్డి,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో తలసేమియా సికిల్ సొసైటీ ఆధ్వర్యంలో కమలా హాస్పటల్ అండ రిసెర్చ్ సెంటర్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తలసేమియా బాధితుల బాధలు చూడలేక బాధితులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చామన్నారు. వారికి నెలకు రూ.6,500 సహాయంగా ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎటువంటి సహాయం కావాలన్నా తోడుగా ఉంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కర్నాటకలో తీరని వరద కష్టాలు

## జనార్ధన్ పూజారి ఇంట్లోకి వరద నీరు

బెంగళూరు,ఆగస్ట్10 (ఆర్ ఎన్ఎ): కర్నాటకలో భీకరంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు పోటెత్తుతున్నాయి. మంగుళూరుకు చెందిన మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత బీ. జనార్ధన్ పూజారి ఇంట్లోకి వరద నీరు ప్రవేశించింది. దక్షిణ కన్నడలోని బంట్వాల్‌లో మాజీ ఎంపీ ఇల్లు ఉన్నది. అయితే నేత్రావతి నది తీవ్ర స్థాయిలో ఉప్పొంగుతున్నది. 1974 తర్వాత ఇంత స్థాయిలో నేత్రావతి ఉప్పొంగు తున్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. 1974లోనూ నేత్రావతి నది నీళు మాజీ ఎంపీ జనార్ధన ఇంట్లోకి ప్రవేశించినట్లు కొందరు తెలిపారు. అయితే నదిలో నీరు ఇంట్లోకి ప్రవేశించడంతో జనార్ధన్ దాంట్లోనే చిక్కుకున్నాడు. ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చి మాజీ ఎంపీని ఇంట్లో నుంచి తీసుకువచ్చి రక్షించారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇవాళ కర్నాటక వెళ్లారు. అక్కడ ఆమె వరద పరిస్థితిపై సమీక్ష చేపట్టనున్నారు.

బెల్గావ్, బగల్‌కోట్ జిల్లాల్లో ఆమె పర్యటించనున్నారు. మాజీ సీఎం కుమారస్వామి బగల్‌కోట్‌లో వరద బాధితులను కలుసుకోనున్నారు.

# సురేశ్ రైనాకు శస్త్ర చికిత్స


న్యూఢిల్లీ,ఆగస్ట్10 (ఆర్ ఎన్ఎ): టీమిండియా సీనియర్ క్రికెటర్ సురేశ్ రైనాకు శస్త్ర చికిత్స జరిగింది. కొన్ని నెలలుగా మోకాలి సమస్యతో బాధపడుతున్న రైనా.. అమస్టర్ డ్యామ్ లో మోకాలికి సర్జరీ చేయించుకున్నాడు. 32 ఏండ్ల రైనా గత సీజన్ నుంచి మోకాలి నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. శాశ్వత పరిష్కారం కోసం వైద్యుల సూచన మేరకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆపరేషన్ విజయవంతమైందని కోలుకునేందుకు 4 నుంచి 6 వారాల సమయం పడుతుందని డాక్టర్లు వెల్లడించాడు. అంతర్జాతీయ కెరీర్ లో రైనా భారత్ తరఫున 18 టెస్టులు, 226 వన్డేలు, 78 టీ20లు ఆడాడు. లీడ్స్ లో ఇంగ్లాండ్ తో 2018 జులైలో జరిగిన వన్డే మ్యాచ్ లో చివరిసారిగా భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

# సైకో శ్రీనివాసరెడ్డి అకృత్యాలు

## విస్తుగొలిపేలా ఎఫ్ఎల్ఎస్ రిపోర్ట్

హైదరాబాద్,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): సైకో కిల్లర్ శ్రీనివాస రెడ్డి అకృత్యాలు బయటపడుతున్నాయి. రిపోర్టులు చూస్తే దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడయ్యాయి. హాజీపూర్ సైకో కిల్లర్ శ్రీనివాస్ రెడ్డి కేసులో పోలీసులు కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. శ్రీనివాస్ ముగ్గురిని అత్యాచారం చేసి హత్య చేశాడని పోలీసులకు టెక్నికల్, ఎఫ్ఎసఎల్ రిపోర్ట్లు అందించింది. నిందితుడి సెల్ ఫోన్‌లో ఉన్న మెసేజ్లు, వీడియోల ఆధారంగా హత్య జరిగిన ప్రదేశంలో శ్రీనివాస్ రెడ్డి సెల్ ఫోన్ సిగ్నల్స్ పక్కాగా పోలీసులు సేకరించారు. అమ్మాయిల మృతదేహాలపై ఉన్న రక్తపు మరకలు శ్రీనివాస్ రెడ్డివిగా ఎఫ్ఎల్ఎస్ రిపోర్ట్ తేల్చింది. కాగా శ్రావణి, మనీషా, కల్పనలను అత్యాచారం చేసి నిందితుడు శ్రీనివాస్ రెడ్డి హత్య చేశాడని గుర్తించారు. ఈ కేసు విషయంలో 300 మంది సాక్షులను పోలీసులు విచారించారు. కోర్టులో నేరం నిరూపణ కావడానికి కావలసిన బలమైన సాక్ష్యాధారాలను పోలీసులు అన్నిటినీ సేకరించి కోర్టుకు అందజేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా శ్రీనివాస్ రెడ్డి విచారణ కొనసాగనుంది. ప్రస్తుతం నిందితుడు వరంగల్ సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉన్నాడు.

# సుష్మ మృతికి ఐక్యరాజ్య సమితి సంతాపం



## నివాళి అర్పించిన దౌత్యవేత్తలు

న్యూయార్క్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ మృతిపట్ల 51 దేశాల దౌత్యవేత్తలు నివాళులర్పించారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో సుష్మా ఫోటోకు నివాళులర్పించిన దౌత్యవేత్తలు.. అక్కడున్న పుస్తకంలో సంతాప సందేశం రాశారు. ప్రపంచంలోని పలు దేశాల దౌత్యవేత్తలు.. సుష్మా మృతి పట్ల నివాళులర్పించి..

సంతాప సందేశంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం గొప్ప విషయమని పేర్కొంటూ యూఎన్‌లోని భారత అంబాసిడర్ సయీద్ అక్బరుద్దీన్ ట్వీట్ చేశారు. 2014 నుంచి 2019 వరకు నరేంద్ర మోదీ కేబినెట్ లో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా సుష్మా స్వరాజ్ సేవలందించిన విషయం విదితమే. సంతాపం సందేశం తెలిపిన దేశాలు.. రష్యా, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అ÷-జ్గ÷ంటీనా, బహ్రెయిన్, బంగ్లాదేశ్, భూటాన్, బోట్స్‌వానా, దక్షిణ కొరియా, ఈజిప్ట్, ఫిజి, జార్జియా, ఘనా, కెన్యా, మలేషియా, మాల్దీవులు, మల్టా, మయన్మార్, నేపాల్, న్యూజిలాండ్, సింగపూర్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్, ఇజ్రాయెల్, యూఏఈతో పాటు పలు దేశాలు ఉన్నాయి.

# సోనియా, రాహుల్ మధ్యలోనే వెళ్లిపోయారు..

హైదరాబాద్, ఆగష్టు 10: కాంగ్రెస్ పార్టీ చీఫ్ నియామకం కోసం ఆ పార్టీ సీనియర్ నేతలు తీవ్ర మేథోమనథం చేస్తున్నారు.

ఢిల్లీలో ఆ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశమైన విషయం తెలిసిందే. మొత్తం అయిదు బృందాలుగా విడిపోయిన నేతలు.. కొత్త చీఫ్ కోసం కసరత్తు మొదలుపెట్టారు. అయితే సమావేశం ఆరంభంలో కొద్ది సేపు పాల్గొన్న సోనియా, రాహుల్ గాంధీలు.. ఆ తర్వాత ఆ సమావేశాలను మధ్యలోనే వదిలి వెళ్లారు. అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేయడంతో.. వారసుడు ఎవరన్న దానిపై తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. మల్లిఖార్జున్ ఖర్గే, ముకుల్ వాస్నిక్ పేర్లు గట్టిగా వినిపిస్తున్నా.. ఎవరు పార్టీ అధ్యక్ష పీఠాన్ని అధిరోహిస్తారో ఇంకా స్పష్టంగా తెలియదు. పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్న ప్రియాంకా గాంధీ మాత్రం సీడబ్ల్యూసీ నేతలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# మాజీ కేంద్ర మంత్రి ఇంట్లోకి వరద నీరు.. రక్షించిన దళాలు



హైదరాబాద్, ఆగస్ట్10: కర్నాటకలో భీకరంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు పోటెత్తుతున్నాయి. మంగుళూరుకు చెందిన మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత బీ. జనార్ధన్ పూజారే ఇంట్లోకి వరద నీరు ప్రవేశించింది. దక్షిణ కన్నడలోని బంట్వాల్‌లో మాజీ ఎంపీ ఇల్లు ఉన్నది. అయితే నేత్రావతి నది తీవ్ర స్థాయిలో ఉప్పొంగుతున్నది. 1974 తర్వాత ఇంత స్థాయిలో నేత్రావతి ఉప్పొంగుతున్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. 1974లోనూ నేత్రావతి నది నీళు మాజీ ఎంపీ జనార్ధన ఇంట్లోకి ప్రవేశించినట్లు కొందరు తెలిపారు. అయితే నదిలో నీరు ఇంట్లోకి ప్రవేశించడంతో జనార్ధన్ దాంట్లోనే చిక్కుకున్నాడు. ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చి మాజీ ఎంపీని ఇంట్లో నుంచి తీసుకువచ్చి రక్షించారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇవాళ కర్నాటక వెళ్లారు. అక్కడ ఆమె వరద పరిస్థితిపై సమీక్ష చేపట్టనున్నారు. బెల్గావ్, బగల్‌కోట్ జిల్లాల్లో ఆమె పర్యటించనున్నారు. మాజీ సీఎం కుమారస్వామి బగల్‌కోట్‌లో వరద బాధితులను కలుసుకోనున్నారు

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి వాటిని సంరక్షించాలి

- జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు




కొండాపూర్, ఆగష్టు 9: పర్యావరణానికి హరితే రక్ష అని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని హరిదాసు తమ్మలి భాయితండా గ్రామాలలో హరితహారం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. గ్రామంలో ఇంకుడు గుంతలు మరుగుదొడ్లు మురికి కాలువలు సిసి రోడ్లు సరిగా ఉన్నాయా అని గ్రామస్తులను అడిగారు. గ్రామస్తులు అన్నీ ఉన్నాయని గ్రామంలో సమస్యలు ఏమీ లేవని తెలిపారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు పరిష్కారం మొక్కలు నాటడమేనన్నారు. వారం, పది రోజులుగా వర్షాలు కురుస్తున్నందున మొక్కలు విరివిగా నాటుతున్నట్లు వివరించారు. గ్రామాల్లో మొక్కల సంరక్షణ బాధ్యతలు సర్పంచ్, కార్యదర్శితో పాటు వార్డు సభ్యులు, గ్రామస్థులపై కూడా ఉంటుందన్నారు. సిద్దిపేట జిల్లాలో ఇబ్రహీంపూర్ గ్రామం మెదక్ జిల్లాలో మల్కాపూర్ గ్రామం తర్వాత హరిదాసు పూర్ గ్రామం ఆదర్శంగా ఉందని గ్రామంలో గ్రామ సర్పంచ్ మహమ్మద్ షఫీ ప్రోత్సాహం బాగానే ఉందని గ్రామంలో ఉన్న యువత ఐక్యమత్యంగా ఉండడం మరియు యువత అందరూ కమిటీలు ఏర్పాటు చేసుకొని గ్రామ అభివృద్ధికి సహకరించడం చాలా గొప్ప విషయమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో గ్రామస్తులు కూడా చాలా ఉత్సాహంగా కనిపిస్తున్నారని ఈ విధంగా ఉంటే చాలని గ్రామ అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్వాడీ పిల్లల చేత తల్లిపాల వారోత్సవం పై చిన్న నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను చూసిన కలెక్టర్ పిల్లలు చాలా చలాకీగా ఉన్నారు అని అన్నారు గ్రామంలో పిల్లలు ఉపాధ్యాయులు యువత గ్రామస్తులు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ అందరూ ఐకమత్యంగా ఉండడం వల్లనే గ్రామం ఎంత చక్కగా ఉందని అభివృద్ధికి నిదర్శనం హరిదాస్ పూర్ గ్రామం అని ఆయన అన్నారు. ఇంకా గ్రామంలో ఏమైనా భూముల విషయంలో సమస్యలు ఉంటే ఈ నెల 13వ తేదీన మండల తహసిల్దార్ బలరాం మీ గ్రామంలో భూ వాణి కార్యక్రమం నిర్వహిస్తారని ఆ రోజు అందరూ రైతులు గ్రామస్తులు అందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏమైనా భూ సమస్యలు ఉంటే గ్రామంలోనే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. మీరు పట్వారి వెంట తిరిగి బుక్ తెచ్చుకోవడం కాదని పట్వారి మీ ఇంటికి వచ్చి పట్టా పాస్ పుస్తకం ఇస్తాడు అని ఆయన తెలిపారు. హరిదాసు పూర్ గ్రామాన్ని ఇతర గ్రామపంచాయతీలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామాన్ని డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు దత్తత తీసుకోవడం జరిగింది. అనంతరం డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈరోజు మనం స్వచ్ఛమైన గాలి పీలుస్తూ ఉన్నామంటే రోజు మంచి నీరు తాగుతున్న మంటే దానికి కారణం చెట్లని మానవుని జీవన మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన సూచించారు. గ్రామం అభివృద్ధి పథంలో నడవాలి అంటే అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మంజుశ్రీ మండతాసిల్దార్ బలరాం ఎంపీడీవో ఆర్. స్వప్న ఏపీవో వీరప్ప, మండల వ్యవసాయ అధికారి ని పీ. ప్రతిభ, గ్రామ సర్పంచ్ మొహమ్మద్ షఫీ ఎంపీటీసీ లక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్రకు జలకళ

### భారీగా తరలివస్తున్న పర్యాటకులు

జోగులాంబ గద్వాల,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రాష్ట్రంలోని జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. నిండు కుండలా తొణుకుతున్న ప్రాజెక్టులను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివెళున్నారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో తుంగభద్ర జలాశయం గేట్లు ఏ క్షణంలోనైనా ఎత్తే అవకాశం ఉందని తుంగభద్ర బోర్డు ఫస్ట్ ఫ్లడ్ బులెటిన్‌ను శనివారం ఉదయం విడుదల చేసింది. ఈ క్రమంలో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులను తుంగభద్ర బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. 1633 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన తుంగభద్ర డ్యామ్‌లో ప్రస్తుత నీటి మట్టం 1626.08 అడుగులకు చేరింది. 100.855 టీఎంసీల నీటికి గానూ.. 76.377 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం తుంగభద్రలోకి 1,84,012 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 2,522 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు.

# పాక్ మరో నిర్ణయం

## లాహరో-ఢిల్లీ బస్సు రద్దు



హైదరాబాద్,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): భారత్‌తో దౌత్య, వాణిజ్య సంబంధాలను తెంచేసుకున్న పాకిస్థాన్ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వినోద రంగానికి చెందిన అన్ని రకాల సాంస్కృతిక మార్పిడిలు, కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్టు పాక్ నిర్ణయించింది. అంతేకాకుండా సంఝౌతా ఎక్స్‌ప్రెస్ సేవలను నిలిపివేసిన పాకిస్థాన్ నిన్న థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలపై సైతం వేటు వేసింది. తాజాగా లాహోర్ - ఢిల్లీ ఫ్రెండ్‌షిప్ బస్సు సర్వీసులను కూడా పాకిస్థాన్ రద్దు చేసింది. లాహోర్ - ఢిల్లీ బస్సు సర్వీసును తొలిసారిగా 1999, ఫిబ్రవరిలో ప్రారంభించారు. 2001లో పార్లమెంట్‌పై దాడి తర్వాత ఆ బస్సు సర్వీసులను రద్దు చేశారు. మళ్లీ 2003లో ఆ బస్సు సేవలను పునరుద్ధరించారు. తాజాగా మళ్లీ బస్సు సర్వీసులను పాక్ రద్దు చేసినట్లు పాకిస్థాన్ మంత్రి వెల్లడించారు. జాతీయ భద్రతా కమిటీ(ఎన్ఎస్‌సీ) సమావేశంలో లాహోర్ - ఢిల్లీ బస్సు సర్వీసులను రద్దు చేయాలని నిర్ణయించినట్లు పాక్ మంత్రి మురాద్ సయీద్ ప్రకటించారు. ఈ బస్సు ఢిల్లీ గేట్‌కు సమీపంలో అంబేడ్కర్ టెర్మినల్ తన సేవలను కొనసాగిస్తుంది. ఢిల్లీ నుంచి ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో లాహోర్‌కు ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ బస్సులు వెళ్తాయి. పాకిస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బస్సులు కూడా ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఢిల్లీ నుంచి లాహోర్ బయల్దేరుతాయి.

## నాలుగు రాష్ట్రాల ఎన్నికలపై బిజెపి దృష్టి

### ఇన్‌చార్జీలను నియమించిన పార్టీ

న్యూఢిల్లీ,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): త్వరలో జరగబోయే నాలుగు రాష్ట్రాల ఎన్నికలకు భాజపా సిద్ధమవుతోంది. నాలుగు రాష్ట్రాలకు కొత్తగా ఇన్‌ఛార్జ్‌లతో ముందుకు వెళ్లబోతున్నది. అందులో భాగంగా హరియాణా, దిల్లీ, మహారాష్ట్రలో ఎన్నికల ఇన్‌ఛార్జిలను పార్టీ నియమించింది. దిల్లీ ఎన్నికల ఇన్‌ఛార్జిగా కేంద్రవ ంత్రి ప్రకాశ్ జావడేకర్, హరియాణాకు కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమర్, మహారాష్ట్రకు పార్టీ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. అలాగే ఝార్ఖండ్ ఎన్నికల బాధ్యతల్ని పార్టీ ఉపాధ్యక్షుడు ఓపీ మాథుర్‌కు అప్పగించారు. హరియాణా, మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ఈ ఏడాది చివర్లో, దిల్లీలో 2020లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. దిల్లీ తప్ప మిగిలిన మూడు రాష్ట్రాల్లో ప్రస్తుతం భాజపా అధికారంలో ఉంది. వీటిని నిలబెట్టుకుంటూనే దిల్లీలోనూ ఈసారి పార్టీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే అనుభవమున్న నాయకులను ఎన్నికల బాధ్యులుగా నియమించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఎన్నికలను బిజెపి ప్రతిష్టగా తీసుకోబోతున్నది.

# డిసెంబరు నాటికి రాయదుర్గానికి మెట్రో



హైదరాబాద్, ఆగష్టు 10: హైటెక్‌సిటీ నుంచి రాయదుర్గం వరకు నిర్మిస్తున్న మెట్రోమార్గం పూర్తి కావడానికి మరో నాలుగు నెలలు పట్టే అవకాశం ఉందని ఇంజినీర్లు చెప్పారు. రాయదుర్గం మార్గం డిసెంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న హైటెక్‌సిటీ రివర్సల్ సౌకర్యం కొంత ఆలస్యం కానున్నది. ఆగష్టు మొదటి వారంలో రివర్సల్ సౌకర్యం అందుబాటులోకి తేవాలని భావించినప్పటికీ సాంకేతిక కారణాలతోపాటు నగరంలో వరుసగా కురిసిన వర్షాలతో కొంత జాప్యం జరుగుతున్నది. ముఖ్యమైన పనులు కొన్ని పూర్తికాకపోవడంతో త్వరలో పనులు పూర్తిచేసి ఆగష్టు చివరివారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనప్పటికీ చివరి వారంలో అందుబాటులోకి రానున్నది. దీనివల్ల హైటెక్‌సిటీ మార్గంలో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరుగనున్నది. మెట్రో రివర్సల్ సదుపాయం అందుబాటులోకి రానుండటంతో హైటెక్‌సిటీ మార్గంలో నడిచే రైళ్లు వేగం పుంజుకోనున్నాయి. నాగోల్ నుంచి హైటెక్‌సిటీ వరకు మెట్రోరైలు రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులను చేరవేస్తున్నప్పటికీ రివర్సల్ సౌకర్యం లేకపోవడంతో అమీర్‌పేట్ నుంచి హైటెక్‌సిటీ వరకు మెట్రోరైలు ఆపరేషన్స్ మిగతా మార్గాల్లో నడిచినంతగా వేగం పుంజుకోలేకపోతున్నాయి.

అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీకి సంబంధించిన 8.5 కిలోమీటర్ల మార్గంలో, 5 కిలోమీటర్ల మార్గంలో ట్విన్ సింగిల్‌లైన్ మెథడ్‌లో ప్రస్తుతం మెట్రోరైలు ఆపరేషన్స్ జరుగుతున్నాయి. రివర్సల్ సౌకర్యం లేకపోవడంతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ఏ లైనులో వెళుతుందో అదే లైనులో రివర్స్ వస్తుండటంతో హైటెక్‌సిటీకి వెళ్లిన రైలు తిరిగి వచ్చే వరకూ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్దే నిలిపి వేయాల్సి వస్తున్నది. ఇలా ట్విన్ సింగిల్‌లైన్ మెథడ్‌లో రైళ్లు నడుస్తుండటంతో ఆలస్యం అవుతుంది. ఒక్కోరైలు 7.5 నిమిషాల నుంచి 15 నిమిషాల వ్యవధితో నడుస్తున్నాయి. అయితే రివర్సల్ సదుపాయం అందుబాటులోకి వస్తే కేవలం 5 నిమిషాలకో రైలు నడిపించేందుకు వీలుంటుంది. కారిడార్-3కు సంబంధించి హైటెక్‌సిటీ మార్గానికి డిమాండ్ ఎక్కువ ఉన్నప్పటికీ ట్విన్ సింగిల్‌లైన్ మెథడ్‌తో ఆలస్యం జరుగుతుండటంతో ఐటీ ఉద్యోగులు ప్రైవేటు, ఆర్టీసీ, వ్యక్తిగత వాహనాలు వినియోగిస్తున్నారు. రివర్సల్ సౌకర్యం అందుబాటులోకి వస్తే ఈ సమస్య తీరి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.

### తేదీ ఖరారు కావాల్సి ఉంది: ఎండీ

రివర్సల్‌కు సంబంధించిన తేదీ ఇప్పటి వరకు ఖరారు కాలేదని, అధికారికంగా క్లియరెన్స్ వచ్చాకే వివరాలు ప్రకటిస్తామని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రివర్సల్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయని, త్వరలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. రివర్సల్ సదుపాయం అందుబాటులోకి వస్తే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. హైటెక్‌సిటీ నుంచి రాయదుర్గం పనులు కూడా అతి త్వరలో పూర్తవుతాయని అన్నారు.

# ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు చుక్కలు చూపించనున్న యాపిల్..?




హైదరాబాద్, ఆగష్టు 10:సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ యాపిల్ తన ప్రొడక్ట్‌లను వాడే కస్టమర్లకు ఎంతటి పటిష్టమైన సెక్యూరిటీ, ప్రైవసీలను కల్పిస్తుందో అందరికీ తెలిసిందే. ఆండ్రాయిడ్ కన్నా మెరుగైన సెక్యూరిటీ, ప్రైవసీ సదుపాయాలు యాపిల్ ప్రొడక్ట్స్‌లో వినియోగదారులకు లభిస్తాయి. ముఖ్యంగా వినియోగదారులకు సంబంధించిన వ్యక్తిగత డేటాను కాపాడే విషయమై యాపిల్ పటిష్టమైన చర్యలు తీసుకుంటుంది. తాను డెవలప్ చేసే యాప్స్ మాత్రమే కాదు, ఇతర థర్డ్‌పార్టీ కంపెనీలు డెవలప్ చేసే యాప్స్‌పై కూడా యాపిల్ నియంత్రణ కలిగి ఉంటుంది. వినియోగదారుల డేటా చోరీకి, హ్యాకింగ్‌కు గురికాకుండా చూస్తుంటుంది. అయితే ఇకపై యాపిల్ ఈ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించనుందట. దీంతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు వినియోగదారుల డేటా సేకరించడం విషయమై మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వాట్సావ్, ఫేస్‌బుక్ మెసెంజర్‌లలో అందుబాటులో ఉన్న ఇంటర్నెట్ వాయిస్ కాల్ సదుపాయంతోపాటు ఆయా యాప్స్‌కు చెందిన సేవలను వాడుకునే సమయంలో ఆ యాప్స్.. యూజర్లకు చెందిన డేటాను బ్యాక్‌గ్రౌండ్‌లో సేకరిస్తుంటాయి. ఇందుకు గాను ఈ రెండు యాప్స్ ఇప్పటి వరకు ఐఓఎస్ ప్లాట్‌ఫాంపై యాపిల్‌కు చెందిన ప్రత్యేకమైన డెవలపర్ టూల్ సహాయంతో వినియోగదారులకు చెందిన డేటాను ఆయా సమయాల్లో సేకరిస్తూ వస్తున్నాయి. అయితే ఇకపై ఫేస్‌బుక్, వాట్సాప్ మెసెంజర్‌లకు ఈ వెసులుబాటు ఉండదని తెలుస్తోంది. ఎందుకంటే.. త్వరలో యాపిల్ విడుదల చేయనున్న ఐఓఎస్ 13 ఆపరేటింగ్ సిస్టమ్‌లో యూజర్ల డేటాకు మరింత ప్రైవసీని అందించే విషయమై యాపిల్ కఠినమైన నిర్ణయం తీసుకుందట.

యాపిల్ తీసుకోబోతున్న ఈ నిర్ణయం నిజమైతే గనక ఇకపై ఐఫోన్లు, ఐప్యాడ్లలో మరింత గోప్యంగా యూజర్లు వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్ సేవలను ఉపయోగించుకునేందుకు వీలు కలుగుతుంది. అయితే ఇదే నిర్ణయం ఆ యాప్‌లకు అశనిపాతంగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే ఆ యాప్‌లు రెండూ ఫేస్‌బుక్‌కు చెందినవే కనుక.. ఆ సంస్థ పెద్ద ఎత్తున డేటా సేకరించి దాన్ని యాడ్స్‌కు, ఇతర అవసరాలకు వినియోగిస్తుంది కనుక.. యాపిల్ నిర్ణయం ఫేస్‌బుక్‌కు సంకటంగా మారే అవకాశం ఉంటుంది. ఇక వచ్చే నెలలోనే యాపిల్ ఐఓఎస్ 13ను విడుదల చేస్తుందని తెలుస్తుండగా.. అప్పటి వరకు ఆగితేగానీ ఈ విషయంపై స్పష్టత రాదు..!

# కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయ్‌కుమార్?

### జాతీయస్థాయిలో జోరుగా ప్రచారం

### సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్

న్యూఢిల్లీ,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి విజయ్ కుమార్ నియమకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ప్రకటన కోసం ప్రభుత్వం ఎదురు చూస్తోన్నట్లు సమాచారం. వీరప్పన్‌ను మట్టుపెట్టడంలో కీలకంగా వ్యవహరించిన అధికారిగా పేరుంది. ఎన్‌కౌంటర్లు చేయడంలో స్పెషలిస్ట్‌గా గుర్తింపు పొందిన విజయ్ నియమానికి రాష్ట్రపతి కూడా సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు రేపోమాపో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. దీంతో కశ్మీర్ తొలి ఎల్జీగా నియామకమైన అధికారిగా విజయ్ గుర్తింపు పొందనున్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్, లధక్ కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ కేంద్రం తరఫున ప్రతినిధిగా లెఫ్టినెంట్ గవర్నర్ ఉంటారు.

ప్రస్తుతం జమ్మూకశ్మీర్, లధక్ వ్యవహారాలను గవర్నర్ సత్యపాల్ మాలిక్ చూస్తున్నారు. ఇప్పుడు రెండు ప్రాంతాలకు వేర్వేరుగా లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించి.. అక్కడ పాలనను గాడినపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రిటైర్డ్ ఐపీఎస్ విజయ్ కుమార్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్టు ఢిల్లీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. మరోవైపు ఆయన నియమకానికి సంబంధించి అధికారిక ప్రకటన రాకముందే సోషల్ మీడియాలో విజయ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుత్తున్నాయి. విజయ్ కుమార్ తమిళనాడుకు చెందిన 1975 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఈయనకు పెద్ద సక్సెస్‌ఫుల్ ట్రాక్ రికార్డే ఉంది. కర్ణాటక-తమిళనాడు ప్రభుత్వాలకు కంటిలో నలుసులో మారిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను 2004 అక్టోబర్‌లో అంతమొందించిన తమిళనాడు స్పెషల్ టాస్క్ ఫోర్స్ చీఫ్‌గా వ్యవహరించారు. వీరప్పన్‌ను పట్టుకున్న తర్వాత విజయ్ పేరు ప్రపంచానికి తెలిసింది. అంతే కాదు చెన్నై పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో.. ఎంతో మంది నేరస్థులను ఎన్‌కౌంటర్ చేశారు. 2008లో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ చీఫ్‌గా నియమితులయ్యారు. 2010నాటి దంతెవాడ ఘటన తర్వాత విజయ్ కుమార్ సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా 2010-2012 మధ్య కాలంలో మావోయిస్టుల ఏరివేత, అటు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఆటకట్టించడంలో కీలక పాత్ర పోషించారు. 2018లో కశ్మీర్ గవర్నర్‌కు భద్రతా వ్యవహారాల సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ నగరంతో కూడా ఆయనకు మంచి సంబంధాలున్నాయి. గతంలో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి అధిపతిగా పనిచేశారు. ఆ తర్వాత డీజీ, సీఆర్పీఎఫ్ డీజీగా పనిచేసి పదవీ విరమణ అయ్యారు. ఆ తర్వాత కూడా వామపక్ష తీవ్రవాద ప్రాంతాలకు హోం మంత్రిత్వ శాఖకు సీనియర్ సలహాదారుగా పనిచేశారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న ఈఎస్ఎల్ నరసింహన్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పంపుతారంటూ ప్రచారం కూడా

# క్రీడలు

## బీసీసీఐ నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్ర క్రీడాశాఖ మంత్రి




హైదరాబాద్: నాడా పరిధిలోకి బీసీసీఐ రావడాన్ని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజుజు స్వాగతించారు. దీని ద్వారా క్రీడల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఇక నుంచి క్రికెటర్లు కూడా డోపింగ్ పరీక్షలకు హాజరుకానున్నట్లు శుక్రవారం బీసీసీఐ చెప్పిన విషయం తెలిసిందే. బీసీసీఐ ఓ పాజిటివ్ నిర్ణయం తీసుకున్నదని మంత్రి రిజుజు చెప్పారు. క్రీడలు, క్రీడాకారుల సమస్యలు అపరిష్కృతంగా ఉండడాన్ని సహిచంలేనని మంత్రి తెలిపారు. ఇన్నాళ్లు స్వతంత్రంగా వ్యవహరించిన బోర్డు...నాడా నిబంధనలకు అనుగుణంగా మారేందుకు ముందుకొచ్చింది. కేంద్ర క్రీడా కార్యదరి రాధేశ్యామ్ ఝులనియా, నాడా డీజీ నవీన్ అగర్వాల్‌తో బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ, క్రికెట్ ఆపరేషన్స్ జీఎం సాబా కరీమ్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ భేటీలో తాము నాడా పరిధిలో వచ్చేందుకు సమ్మతమే అంటూ లిఖితపూర్వక హామీ ఇచ్చారు. దీంతో ఇక నుంచి నాడా నీడలోకి రావడంతో పాటు ఇకముందు జాతీయ స్పోర్ట్స్ సమాఖ్య(ఎన్ఎస్ఎఫ్)గా బీసీసీఐ ఏర్పడనుంది. ఈ కారణంగా సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) పరిధి కింద బీసీసీఐని ప్రశ్నించే అవకాశం కూడా దక్కింది. బోర్డులో జరుగుతున్న ఏ విషయం గురించి అయినా ఆర్టీఐ కింద సమాచారం పొందే అవకాశం లభిస్తుంది. బీసీసీఐ సమ్మతితో క్రికెటర్లందరినీ నాడా పరీక్షిస్తుందని క్రీడా కార్యదర్శి ఝులనియా అన్నారు. అంగీకారానికి ముందు బీసీసీఐ మా ముందు మూడు ప్రతిపాదనలు తీసుకొచ్చింది. డోప్ టెస్టింగ్ కిట్స్ నాణ్యత, పాథలజిస్టుల అనుభవం, సాంపిల్ సేకరణ. బోర్డు కోరిన వాటికి మేము సమ్మతించాం. కానీ సమకూర్చేందుకు డబ్బులు వసూలు చేస్తాం. అలాగనీ దేశంలోని అన్ని ఎన్ఎస్ఎఫ్‌ల లాగే బీసీసీఐకి సౌకర్యాలు కల్పిస్తాం అందులో ఎలాంటి తేడా ఉండదు. ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందే అని ఝులనియా అన్నారు.

## పాపం క్రిస్‌గేల్.. అనుకున్నదొకటి.. అయినదొక్కటి..!

గయానా: తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు.. వెస్టిండీస్ స్టార్ క్రికెటర్ క్రిస్ గేల్ ఒకటి అనుకుంటే.. మరొకటి జరిగింది. భారత్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు క్రిస్‌గేల్ వీడ్కోలు చెబుదామని అనుకున్నాడు. కానీ సెలెక్టర్లు మాత్రం అతని ఆశను అడియాశను చేశారు.

ఇటీవల ముగిసిన వన్డే ప్రపంచకప్ అనంతరం రిటైర్ అవుతానని క్రిస్‌గేల్ అంతకు ముందే ప్రకటించాడు. అయితే తర్వాత మనస్సు మార్చుకున్న గేల్ స్వదేశంలో భారత్‌తో జరిగే టెస్టు సిరీస్ ఆడి రిటైర్ అవుతానని ప్రకటించాడు. అయితే త్వరలో భారత్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌కు మాత్రం విండీస్ సెలెక్టర్లు గేల్‌ను పక్కన పెట్టేశారు. కానీ ఇప్పుడు గేల్ వన్డే సిరీస్‌లో మాత్రం ఆడుతున్నాడు. అయితే గేల్‌కు టెస్టు సిరీస్ ద్వారా రిటైర్మెంట్ అయ్యే చాన్స్ లేకపోవడంతో ప్రస్తుతం జరుగుతున్న వన్డే సిరీస్ ద్వారానే రిటైర్ అవుదామని చూస్తున్నాడట. ఇక ఈ విషయంపై గేల్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో చూడాలి.

భారత్‌తో జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లకు విండీస్ సెలెక్టర్లు ప్రకటించిన జట్టు సభ్యులు వీరే... వెస్టిండీస్ టెస్టు టీం: జేసన్ హోల్డర్ (కెప్టెన్), క్రెయిగ్ బ్రాత్‌వైట్, డారెన్ బ్రేవో, షమరాహ్ బ్రూక్స్, జాన్ క్యాంప్‌బెల్, రోస్టన్ చేజ్, రకీం కార్న్‌వాల్, డొవ్రిచ్, గ్యాబ్రియెల్, హిట్‌మైర్, షై హోప్, కీమర్ రోచ్, కీమో పాల్




## ఏపీలో 100 ఆవులు మృతి.. కారణం ఏంటి?

హైదరాబాద్, ఆగష్టు 10:: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నగర శివారు కొత్తూరు తాడేపల్లి గోశాలలో విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి 100 ఆవులు మృతి చెందాయి. చావు బతుకల మధ్య మరిన్ని ఆవులు కొట్టుమిట్టాడుతున్నాయి. ఒకేసారి 100 ఆవులు మృతి చెందడంతో స్థానికులు షాక్‌కు గురవుతున్నారు. ఆవులు మృతి చెందడానికి గల కారణాలపై గోశాల నిర్వాహకులు, స్థానికులు విశ్లేషిస్తున్నారు. రాత్రి ఆవులకు పెట్టిన దాణాపై నిర్వాహకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గోశాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. మృతి చెందిన ఆవుల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు నిర్ణయించారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాతే ఆవుల మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. గతంలోనూ ఇదే గోశాలలో 24 ఆవులు మృతి చెందాయి.

## తదుపరి మతమార్పిడుల చట్టమేనా?

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): మతమార్పుడులను నిషేధించేందుకు మోదీ సర్కార్ కొత్త చట్టాన్ని తీసుకురావాలనుకుంటున్నట్లు సమాచారం. దీని కోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మతమార్పుడల వ్యతిరేక బిల్లుకు కావాల్సిన అన్ని అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ఇటీవల ముగిసిన బ్జడెట్ సెషన్‌లో పలు కీలక బిల్లులను పాస్ చేశారు. కశ్మీర్‌కు చెందిన ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ బిల్లులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. లోక్‌సభ, రాజ్యసభలో ఈసారి రికార్డు స్థాయిలో బిల్లులు పాసైనట్లు స్పీకర్ ఓం బిర్లా, చైర్మన్ వెంకయ్యనాయుడు తెలిపారు. దీనిపై యూపిలో జరిగిన అరాచకాలతో పాటు దేశంలో అనేక ఘటనలు ఉదహరిస్తున్నారు.

## అనంత్‌నాగ్‌లో నవ్వుతూ స్థానికులతో అజిత్ దోవల్



శ్రీనగర్, ఆగష్టు 10: గతంలో ఉగ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా ఉండే జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నేడు పర్యటించారు. స్థానిక మార్కెట్‌లోని గొర్రెల వ్యాపారులతో అజిత్ దోవల్ కాసేపు ముచ్చటించారు. బక్రీద్ పర్వదినం నేపథ్యంలో గొర్రెల వ్యాపార లావాదేవీల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఓ బాలుడిని తన విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. స్కూల్ బంద్ అయిందా? ఖుషిగా ఉన్నవా? అని అడగగా బాలుడి పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఎక్కడి సంతోషం సర్ అనగా అరే మనకు కాదు పిల్లలు సంతోషంగా ఉంటారని నవ్వులూ పూయించారు. అజిత్ దోవల్ అక్కడి వారితో కాసేపు ముచ్చటించారు. ఓ గంభీర వాతావరణంలో జాతీయ భద్రతా సలహాదారుగా ఎప్పుడూ వ్యూహ రచన, రక్షణ, సమీక్షలతో బిజీ బిజీగా ఉండే అజిత్ దోవల్ ఎంతో ప్రశాంతంగా, నవ్వుతూ అక్కడి స్థానికులతో ముచ్చటించారు. జమ్ముకశ్మీర్‌ను కేంద్ర ప్రభుత్వం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించినప్పటి నుంచి ఆ రాష్ట్రంలో అజిత్ దోవల్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. స్థానికులను కలుస్తూ వారితో సరదాగా ముచ్చటిస్తున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం

విశాఖపట్టణం,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): అక్రమంగా తరలిస్తున్న 500 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గోపాల్‌వసంత్, పాండురంగ అనే ఇద్దరు వ్యక్తులు శనివారం విశాఖ ఏజెన్సీ నుంచి మహారాష్ట్రకు 500 కిలోల గంజాయిని వ్యాన్‌లో తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు మచిలీపట్నం డిగ్రీ కళాశాల వద్ద వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలోనే వాహనంలో 500 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని పోలీసులు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.5 వేల నగదు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై చంద్రమౌళి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ మాత్రమే సమర్థుడైన వ్యక్తి

### అతనే అధ్యక్షుడిగా ఉండాలని కోరాం: భట్టి

న్యూఢిల్లీ,ఆగస్ట్10 (ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం దిల్లీలో ముగిసింది. ఏఐసీసీ అధ్యక్షులుగా రాహుల్ గాంధీయే కొనసాగాలని కోరామని టీపీసీసీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన అయితేనే పార్టీ మనుగడ ఉంటుందన్నారు. మూకుమ్మడిగా అంతా ఒకే నిర్ణయాన్ని వెలిబుచ్చినట్టు ఆయన మీడియాకు వెల్లడించారు. మతతత్వ పార్టీలు దేశాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నాయని భట్టి విమర్శించారు. ఈ తరుణంలో రాహుల్ గాంధీ మాత్రమే కాంగ్రెస్ పార్టీని, దేశాన్ని కాపాడగలరన్నారు. రాహుల్ గాంధీయే కొనసాగాలని కోరుతూ నేతలంతా ఏకవాక్య తీర్మానం చేశారని కాంగ్రెస్ నేత కుసుమ కుమార్ తెలిపారు. మరోవైపు, ఏఐసీసీ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు కొనసాగుతోంది. అధ్యక్షుడి ఎంపిక కోసం నేతల అభిప్రాయాలను సేకరించేందుకు 5 బృందాలను సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఈ రోజు రాత్రి 8గంటలకు మరోసారి సీడబ్ల్యూసీ సమావేశం కానుంది. ఈ భేటీలో నేతల నేతల అభిప్రాయాలను కమిటీలు సమావేశం ముందు ఉంచనున్నాయి. అనంతరం అధ్యక్షుడిపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

## టిటిడి గోశాలల అభివృద్ధికి నిర్ణయం

### ఎస్వీ గోసంరక్షణశాలపై సమీక్ష

తిరుమల,ఆగస్ట్10 (ఆంఎన్ఎ): పలమనేరులో 450 ఎకరాల్లో విస్తరించిన గోశాలను ఇతర గోశాలలకు ఆదర్శంగా, ఉన్నతంగా తీర్చిదిద్దాలని టిటిడి నిర్ణయించింది. టిటిడి ఎస్వీ గోసంరక్షణశాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సమీక్ష జరిగింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ మన్మోహన్ సింగ్‌తో కలిసి టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఇందుకోసం సంవత్సరంలోపు అన్ని పనులు పూర్తి చేయాలని ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్ శ్రీ రామచంద్రారెడ్డికి సూచించారు. ఈ సమావేశంలో టిటిడి తిరుమల ప్రత్యేకాధికారి ఎవి.ధర్మారెడ్డి, తిరుపతి జెఈవో శ్రీ పి.బసంత్‌కుమార్, గోశాల సంచాలకులు డా..హరనాథరెడ్డి పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో ముగిసిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

### నేడు హైదరాబాద్‌లో విజయోత్సవ సభ

### ముఖ్య అతిథిగి రానున్న వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్10 (ఆంఎన్ఎ): గ్రేటర్ టీఆర్ఎస్‌లో ఇక కమిటీ సందడి మొదలుకానున్నది. పాత, కొత్త కలయికలతో సామాజిక సమతూకం పాటిస్తూ కమిటీలను ఎంపిక చేయనున్నారు. డివిజన్, బూత్, బస్తీ కమిటీల్లో దాదాపు తొమ్మిది రకాల అనుబంధ కమిటీలను ఈనెల 20వ తేదీ నాటికి పూర్తి చేయనున్నారు. ఈ కమిటీల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పూర్తి బాధ్యత వహించనున్నారు. ప్రతి కమిటీలోనూ 15మందికి తగ్గకుండా 33మందికి మించకుండా సభ్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. గ్రేటర్‌లో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారంతో ముగిసింది. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, కాలనీలు, బస్తీల్లో పండుగ వాతావరణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా జరిగింది. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 50వేల సభ్యత్వాలు చేయాలనే లక్ష్యంలో భాగంగా స్థానిక నియోజవకవర్గ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని లక్ష్యాన్ని పూర్తి చేశారు. బోనాల ఉత్సవాల్లో శ్రేణులంతా తలమునకలై ఉండడంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఈనెల 10వ తేదీ వరకు సభ్యత్వ నమోదు తుది గడువుకు అవకాశం కల్పించారు. దీంతో పాతనగరంలోని నియోజకవర్గాలు మినహా అన్నింటిలో లక్ష్యానికి మించి సభ్యత్వాలను నమోదు చేయించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఇదే సమయంలో సభ్యత్వాల డిజిటలైజేషన్ వేగవంతం చేసినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదులో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ముందంజలో నిలిపి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రశంసలందుకున్నారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 11వ తేదీ ఆదివారం సభ్యత్వ నమోదు విజయోత్సవ సభ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన జరుగనున్నది. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లకు దిశానిర్దేశర చేయనున్నారు. అయితే ఈ సభ ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే గోపీనాథ్ ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో కూడిన 30 కటౌట్లు ఆకట్టుకోనున్నాయి.

ముఖ్యంగా హైదరాబాద్‌లో నిరంతర విద్యుత్, సమృద్ధిగా నీటి సరఫరా అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. చార్మినార్, బతుకమ్మ తదితర సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ అలంకరణ చేస్తున్నారు. హైదరాబాద్ తాగునీటికి శాశ్వత భరోసాగా నిలిచే కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టతను వివరించేందుకు ప్రత్యేక

ఏర్పాట్లు చేయడం గమనార్హం. ఇకపోతే కమిటీల్లో . డివిజన్, బూత్, బస్తీ కమిటీలకు సంబంధించి యువజన, మహిళా విభాగాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితరులు కలిపి మొత్తం తొమ్మిది అనుబంధ సంఘాలకు కమిటీలు వేయనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో ఇంతకాలం నిమగ్నమైన శ్రేణులంతా పార్టీ నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

## కూతురిని చంపి ఆత్మహత్య చేసుకుందన్న ప్రచారం

### టివి నటి కట్టుకథను బట్టబయలు చేసిన పోలీసులు

ముంబయి,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ఓ టివి యాంకర్ తన కూతురును గొంతు నులిమి చంపి అనంతరం తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కట్టుకథ అల్లింది. ఈ సంఘటన మహారాష్ట్రలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని మనీష్ నగర్ లో ప్రద్న్యా పార్కర్ అనే ఆమె మరాఠి టివిలో యాంకర్‌గా పని చేసేది. ప్రద్న్యా భర్త ప్రశాంత్ పార్కర్ బిజినెస్ మెన్. పార్కర్ కుటుంబం కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది. ఆమె కూతురు శృతి ఎన్ జి బెడ్కర్ కాలేజీలో ఇంటర్ మీడియట్ చదువుతోంది. తన భర్త జిమ్‌కు వెళ్లగానే తన కూతురు శ్రుతిని(17) గొంతు నులిమి చంపి అనంతరం ఉరి వేసింది. తన కూతురు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని పోలీసులను నమ్మించింది. ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నానని శృతికి బదులుగా ఆమె తల్లి సూసైడ్ నోట్ రాసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేసుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ నోట్‌లో రాసిన అక్షరాలు, శ్రుతి నోట్ బుక్‌లో ఉన్న అక్షరాలు ఒకే విధంగా లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే ప్రద్న్యాను పోలీసులు అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో ప్రశ్నించగా తానే హత్యచేశానని ఒప్పుకుందని పోలీస్ అధికారి శేఖర్ బగ్డే తెలిపారు. తన కూతురు శృతిని తన తల్లి ఎందుకు చంపిందో వివరాలు తెలియాల్సి ఉంది.

## స్కూల్లో విద్యుత్‌ఘాతం

### నలుగురు విద్యార్థులకు గాయాలు

మహబూబాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): ఓ ఎయిడెడ్ పాఠశాలలో శనివారం విద్యుదాఘాతంతో పాఠశాల అటెండర్‌తోపాటు నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

ఈ ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది.. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పాఠశాలకు చెందిన అటెండర్ రవికుమార్ వాటర్ ట్యాంకును అమర్చేందుకు ఇనుప పైపును రంపపు బ్లేడ్‌తో కోసాడు.

పక్కనే ఉన్న రోహిత్‌రాజు, అరుణ్, వినోద్, శ్రీధర్ అనే విద్యార్థులు పైపును పైకి లేపే క్రమంలో పైనుంచి వెళ్లిన విద్యుత్ లైన్ తీగలు ఇనుప పైపుకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు, అటెండర్ గాయపడ్డారు. గమనించిన స్థానికులు గాయపడినవారిని హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. సమాచారమందుకున్న డీఎస్పీ నరేశ్‌కుమార్, పట్టణ ఎస్సై అరుణ్‌కుమార్, విద్యాశాఖ ఏఎమ్‌వో శ్రీరాములు ఘటనాస్థలిని సందర్శించి విద్యార్థుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు.

# 'సరిలేరు నీకెవ్వరు' ఇంట్రో టీజర్ విడుదల



మహర్షి చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న మహేష్ బాబు ప్రస్తుతం తన 26వ చిత్రంగా సరిలేరు నీకెవ్వరు అనే సినిమా చేస్తున్నారు. అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని సమాచారం. ఈ రోజు మహేష్ బర్త్‌డే సందర్భంగా ఆయన ఇంట్రో టీజర్ విడుదల చేశారు. ఆర్మీ మేయర్ అజయ్ కృష్ణ పాత్రలో మహేష్ లుక్ అదిరిపోయింది. ఫస్ట్ లుక్‌ని చూసి ఈ చిత్రం భారీ విజయం సాధించడం ఖాయం అని అభిమానులు జోస్యాలు చెబుతున్నారు. అయితే సెంటిమెంట్ పరంగాను ఈ సినిమా భారీ విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మహేష్ బాబు కెరీర్‌లో భారీ విజయం సాధించిన ఒక్కడు, దూకుడు చిత్రాలలో ఆయన అజయ్ అనే పాత్రలో కనిపించి మెప్పించాడు. ఇప్పుడు సరిలేరు నీకెవ్వరు చిత్రంలోను అజయ్ పాత్రలోనే నటిస్తున్నాడు. దీంతో సెంటిమెంట్ పరంగా ఈ సినిమా భారీ హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు. రష్మిక మంధాన కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం విడుదల కానుంది.

# 'ధాకడ్' ఫస్ట్ లుక్ టీజర్ విడుదల







బాలీవుడ్ బ్యూటీ కంగనా రనౌత్ రీసెంట్‌గా తెలుగు డైరెక్టర్ ప్రకాష్ కోవెలమూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'జడ్జిమెంటల్ హై క్యా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో రాజ్ కుమార్ రావ్ హీరోగా నటించారు. ఇక అశ్విన్ అయ్యర్ తివారి దర్శకత్వంలో 'పంగా' అనే క్రీడా ప్రధాన చిత్రంలో నటించనుంది కంగనా. వీటితో పాటు కంగనా .. రజనీష్ రాజి ఘూయ్ దర్శకత్వంలోను ఓ చిత్రం చేస్తుంది. ధాకడ్ అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతుంది. ఇటీవల చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో కంగనా.. మంటల మధ్య నిలుచొని రెండు గన్స్ పట్టుకొని ఉంది. ఈ లుక్‌ని చూస్తుంటే 2001లో ఏంజెలినా జోలి ప్రధాన పాత్రలో తెరకెక్కిన టాంబ్ రైడర్ గుర్తుకొస్తుందని నెటిజన్స్ పేర్కొన్నారు.

తాజాగా ధాకడ్ చిత్ర టీజర్ విడుదల చేశారు మేకర్స్. ఇందులో కంగనా మారణాయుధాలతో షాకింగ్ లుక్‌లో కనిపిస్తుంది. యాక్షన్ మూడ్‌లో ఉన్న ఆమెని చూసిన అభిమానులు కంగనా ఈ చిత్రంతో మరింత అలరించడం ఖాయమని అంటున్నారు. లేడీ ప్రధాన పాత్రలో తెరకెక్కిన తొలి యాక్షన్ ఫిలిం ఇదే కాగా, ఈ సినిమా తన కెరీర్‌లో బెంచ్ మార్క్‌గా నిలుస్తుందని కంగనా భావిస్తుంది . ధాకడ్ చిత్రాన్ని సోహైల్ మాక్లాయ్ నిర్మిస్తుండగా,వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మూవీ రిలీజ్‌కి ఎ÷-లాన్ చేస్తున్నారు. రాజీ ఘూయ్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతున్న విషయం విదితమే


# 'భారతీయుడు 2' ప్రారంభం







'విశ్వనటుడు' కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలోని 'భారతీయుడు2' చిత్రం ఎట్టకేలకు ఆరంభమైంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, సిద్దార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్, ఐశ్వర్యారాజేష్, ప్రియా భవాని శంకర్ తదితరులు నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు పలువురు నిర్మాతలు మారారు. ఇంతకీ ఈ సినిమా ఆరంభమవుతుందా? లేదా?.. అనే సందేహాలు కూడా తలెత్తాయి. ఎట్టకేలకు తాజాగా చిత్రీకరణ మొదలైంది. ఇటీవల కమల్‌హాసన్ బిగ్‌బాస్ హోస్టింగ్‌లో గెటప్ మార్చినప్పుడే అభిమానులు సినిమా గురించి చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలోనటి ప్రియా భవాని శంకర్ ట్విట్టర్‌లో స్పందించింది. అందులో 'ఇటీవల దర్శకుడు శంకర్ కార్యాలయానికి వెళ్లినప్పుడు చాలా అద్భుతంగా మాట్లాడారు. సినిమా కథను రెండు గంటలపాటు వివరించారు. సినిమాలో నా పాత్ర చాలా కీలకం కావడంతో వెంటనే అంగీకరించా. నేను ఈ ప్రపంచాన్ని నమ్ముతున్నా. మన తీరును బట్టే ఈ ప్రపంచం ఏదైనా తిరిగి అందిస్తుంది. నాకు బాగా నచ్చిన కమల హాసన్, సిద్దార్థ్, కాజల్ అగర్వాల్‌తో కలసి శంకర్ దర్శకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. నిజంగానే నేను ఆశీస్సులు పొందిన నటిగా భావిస్తున్నానని' ఆమె పేర్కొన్నారు.

# 'విరాటపర్వం' నుంచి తప్పుకుంటున్న టబు..?





రానా దగ్గుబాటి, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'విరాటపర్వం'. వేణు ఊడుగుల దర్శకత్వం వహిస్తున్నారు. సురేష్‌బాబు, సుధాకర్ చెరుకూరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో ప్రముఖ నటి టబు మానవ హక్కుల పోరాట నాయకురాలిగా కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు ఆమె ఈ చిత్రం నుంచి తప్పుకుంటున్నట్లు గుసగుసలు వినిపస్తున్నాయి. చేతి నిండా ఉన్న ప్రాజెక్టుల కారణంగా డేట్లు సర్దుబాటు కాకపోవడంతో టబు ఈ సినిమా నుంచి తప్పుకుంటోందట. ఆమె స్థానంలో బాలీవుడ్ నటి

నందితా దాస్ నటించనున్నట్లు టాక్. దీనిపై చిత్ర బృందం అధికారికంగా స్పందించాల్సి ఉంది.

మరోవైపు స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కబోతోన్న చిత్రంలో టబు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్‌లో పాల్గొన్న వీడియోను చిత్ర బృందం ఇటీవల ట్విటర్‌లో పంచుకుంది. తెలుగు సినిమాలతో పాటు పలు బాలీవుడ్ చిత్రాల్లో టబు బిజీగా ఉన్నారు.

# రైతుల సమస్యలు ఏనాడైనా చర్చించారా?

## అప్పుల కుప్పగా చేస్తూ పోతున్నారు: కటకం

కరీంనగర్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): రైతుల గురించి గొప్పలు చెబుతున్న సిఎం కెసిఆర్ వారి సమస్యలపై ఏనాడు కూడా ఎందుకు చర్చించలేదని డిసిసి అధ్యక్షుడు కటకం మృత్యుంజయం విమర్శించారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ఒక్కసారి కూడా రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించిన

దాఖలాలు లేవన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతుబంధు పథకంతో ఎకరాకు రూ.5 వేలు చెల్లించినంత మాత్రాన రైతులకు లాభాలు ఉండవని ఆయన చెప్పారు. బతికున్న రైతులకు మేలు చేయకుండా మృతి చెందిన తరువాత రూ.5 లక్షలు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టి రాష్ట్రంలో కుటుంబ పరిపాలన సాగుతోందని అన్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలతో పోరాడి తెలంగాణ సాధిస్తే దొరల పాలనను మరిపించేలా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే పదవులు దక్కాయన్నారు. చదువుకున్న విద్యార్థులను నిరుద్యోగులుగా మారుస్తున్నారని మండి పడ్డారు. గొర్రెలు, బర్రెలిస్తూ రోజుకో విధంగా గారడి మాటలతో అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తోందన్నారు. గొర్రెల పంపిణీతో ఆంధ్రప్రదేశ్‌లో గొర్రెల కాపరులు బాగుపడుతున్నారన్నారు. మంత్రివర్గంలో మహిళలను తీసుకోకుండా నియంత పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. మహిళలపై రోజుకో విధంగా దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో అనేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సామాజికంగా, ఆర్థికంగా, పేదలకు న్యాయం జరగాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు కలసికట్టుగా ముందుకు సాగుతూ ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత పాలనను ప్రజలకు వివరించాల్సిన అవసరముందన్నారు.

# వరదబాధితులకు అండగా ఉంటాం

## -బెల్గాంలో పర్యటించిన నిర్మలా సీతారామన్

బెంగళూరు,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): వరదబాధితులకు తామంతా అండగా ఉన్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బాధితులకు కర్నాటక సర్కార్ తగిని సాయం అందిస్తుందన్నారు.

కర్ణాటకను కకావికలం చేస్తున్న వరదల పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారంనాడు బెంగళూరులో పర్యటించారు. బెల్గాంలో వరదల్లో చిక్కుకున్న పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలను సందర్శించి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారికి అందుతున్న సహాయం, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇవాళ ఉదయమే బెంగళూరుకు చేరుకున్న మంత్రి అక్కడి నుంచి నేరుగా బెల్గాం బయలుదేరి వెళ్లారు. నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతనిధ్యం వహిస్తున్నారు. కాగా, రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ప్రకటించారు. ఇంతవరకూ 24 మంది వరదల్లో ప్రాణాలు కోల్పోయారని, 2 లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. 17 జిల్లాల్లోని 80 తాలూకాల్లో ఉన్న 1024 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయన్నారు. కాగా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైనిక, నావికాదళ సిబ్బంది వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

# గోవుల మరణంపై చలించిన కలెక్టర్

## గోశాలను సందర్శించి పరిస్థితులపై ఆరా

విజయవాడ,ఆగస్ట్10 (ఆంఎన్ఎ): విజయవాడ నగర శివారులోని కొత్తూరుతాడేపల్లిలో 100 గోవులు మృతి చెందిన గోశాలను కృష్ణా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ పరిశీలించారు. గోవులు మృతిచెందడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పరిమితికి మించిన గోవులను ఉంచారని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఆవుల మృతిపై సమగ్ర పరిశీలన చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటన సమయంలోనూ నిర్వాహకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

ఒకరిపైవ ఒకరు ఆధిపత్యం ప్రదర్శిం చేందుకు ప్రయత్నించారు. ఉండాల్సిన సంఖ్య కంటే ఎక్కువ గోవులను గోశాలలో ఉంచారని ఘటనా స్థలాన్ని పరిశీలించిన పశు సంవర్థక శాఖ అధికారులు తెలిపారు. గ్యాస్ ఎక్కువ అవ్వడం వల్ల గోవులు మృతిచెందినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని కలెక్టర్‌కు తెలియజేశారు. పెద్దమొత్తంలో ఆవుల మృతి చెందడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోశాల నిర్వహణ వల్ల ఇప్పటికే భూగర్భ జలాలు కలుషితమైపోయాయని, ఇప్పుడు గోవుల కళేబరాలను కూడా అక్కడే ఖననం చేయడం వల్ల ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గోశాలను పరిశీలించేందుకు వచ్చిన కృష్ణా జిల్లా సబ్ కలెక్టర్ మిషా సింగ్‌తో వారి ఆవేదనను పంచుకున్నారు. మరణించిన గోవులను వేరే ప్రాంతంలో ఖననం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# అధ్యక్ష ఎన్నికపై ఎటూ తేల్చని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

## సమావేశం నుంచి అర్థంతరంగా నిష్క్రమించిన సోనియా, రాహుల్

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): కొత్త అధ్యక్షుడి ఎన్నిక కోసం జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం నుంచి ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అర్ధంతరంగా వెళ్లిపోయారు. సారథి ఎంపిక కోసం సీడబ్ల్యూసీ ఐదు కమిటీలుగా విడిపోయింది. అయితే ఈ కమిటీల్లో తమ పేర్లను చేర్చడంపై సోనియా, రాహుల్ అసహనానికి గురయ్యారు. ఎంపిక బృందాల్లో తమ పేర్లను పొరపాటుగా చేర్చారని.. అధ్యక్ష ఎంపిక కమిటీల్లో తాముండటం సబబు కాదని పేర్కొంటూ వారిద్దరూ భేటీ నుంచి మధ్యలోనే బయటకొచ్చారు. తాము అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా జరగాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. దీనిపై సోనియా గాంధీ మాట్లాడుతూ.. 'ప్రస్తుతం కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి. సహజంగానే నేను, రాహుల్ ఆ చర్చల్లో భాగస్వాములుగా ఉండలేం'అని చెప్పారు. రాహుల్ రాజీనామాతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఇందుకోసం సీడబ్ల్యూసీ నేడు భేటీ అయ్యింది. అయితే సారథి ఎంపికపై విస్తృత స్థాయిలో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర స్థాయి నేతలను సంప్రదించి దీనిపై నిర్ణయం తీసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు. దీంతో సీడబ్ల్యూసీ ఐదు బృందాలుగా విడిపోయింది. ఈ బృందాలు రాష్ట్ర స్థాయి సీఎల్పీ నేతలతో చర్చలు జరిపి అధ్యక్షుడిపై ఓ నిర్ణయానికి రానున్నాయి. అధ్యక్ష పదవికి ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే పేర్లు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. అధ్యక్షుడి ఎన్నికపై విస్తృత స్థాయిలో చర్చలు జరగాలని రాహుల్ గాంధీ అభిప్రాయపడుతున్నారని సమాచారం. రాష్ట్ర స్థాయిలో సీఎల్పీ నేతలతో సంప్రదించిన తర్వాత సారథిని ఎన్నుకోవాలని ఆయన పార్టీకి సూచించినట్లు సమాచారం. దీంతో ఎన్నిక ప్రక్రియ కోసం పార్టీ నేతలు ఐదు బృందాలుగా విడిపోయారు. రాష్ట్ర స్థాయి నేతలతో చర్చలు జరిపేందుకు తూర్పు రీజియర్, పశ్చిమ రీజియన్, ఉత్తర, దక్షిణ, ఈశాన్య రీజియన్ నేతలతో ఐదు బృందాలు ఏర్పాడ్డాయి. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం శనివారం ప్రారంభమైంది. పార్టీ కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోనీ, కేసీ వేణుగోపాల్, జ్యోతిరాదిత్య సింధియా, రణ్‌దీప్ సుర్జేవాలా తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు. ఈ భేటీలో కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. అధ్యక్ష పదవికి సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే పేర్లు జోరుగా వినిపిస్తున్నాయి. తొలుత తాత్కాలిక ప్రాతిపదికన అధ్యక్షుడిని ఎన్నుకుని, ఆ తర్వాత ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి పూర్తిస్థాయి అధ్యక్షుడిని ఎన్నుకుంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే అధ్యక్ష పదవికి అంతర్గత ఎన్నికలు నిర్వహించేందుకు కొందరు సీనియర్లు సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త సారథి ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# వరంగల్ చిన్నారి హత్యాచార ఘటన దారుణం

## పోలీసులు ఆధారాలు సమర్పించడంతో సకాలంలో తీర్పు

హైదరాబాద్,ఆగస్ట్10(ఆర్ఎన్ఎ): వరంగల్‌లో 9నెలల చిన్నారిపై హత్యాచార ఘటన చాలా దురదృష్టకరమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. 51 రోజుల్లోనే పోలీసులు ఆధారాలు సేకరించి.. నిందితుడికి శిక్ష పడే విధంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారని ప్రశంసించారు. టెక్నాలజీని ఉపయోగించి ఆధారాలను కోర్టు ముందు పెట్టారని గుర్తుచేశారు. దీంతో నిందితుడు ప్రవీణ్‌కు న్యాయస్థానం ఉరిశిక్ష విధించిందని చెప్పారు. ఈ కేసులో సీసీ కెమెరాల ఫుటేజ్ చాలా ఉపయోగపడ్డాయని వెల్లడించారు. చిన్నారి తల్లిదండ్రులతో కూడా తాను మాట్లాడి ధైర్యం చెప్పానన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీసులను కిషన్‌రెడ్డి అభినందించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.